
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
బాపట్ల జిల్లా వార్తలు
శుక్రవారం 12 జూలై 2024






విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి విలియమ్స్

సదరంలో.. సర్టిఫికేట్లు



- వైకల్యం లేకపోయినా సర్టిఫికెట్
- దర్జాగా పింఛను అందుకుంటున్న అనర్హులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో భారీగా ధ్రువీకరణలు
- కూటమి ప్రభుత్వం రాకతో వెలుగులోకి నకిలీ లబ్ధిదారులు

శారీరక లోపం.. మనిషికి శాపం. వైక్యలం ఉండే వారి జీవనం కనాకష్టం. వారు పని చేసుకోవాలనుకున్నా శరీరం సహకరించదు. అలాంటి వారికి సాయంగా ప్రభుత్వం పింఛన్ ఇస్తుంది. అయితే ఈ పింఛన్లకు కక్కుర్తి పడిన కొందరు సదరం సర్టిఫికెట్లు పొందుతున్నారు. వైకల్యం లేకపోయినా ఏదో ఒక లోపం ఉన్నట్లుగా సదరం నుంచి ధ్రువీకరణ చేయించుకుని దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటివి పెద్దఎత్తున చోటుచేసుకున్నట్లు తాజాగా వెలుగుచూస్తున్నాయి. ఎటువంటి వైకల్యం లేకపోయినా వైసీపీకి చెందిన వారు పెద్దసంఖ్యలో పింఛన్లు పొందినట్లు వెలుగుచూస్తోంది. సదరం సర్టిఫికెట్లు జారీలో వైసీపీ నేతల ఆధ్వర్యంలో పెద్ద మాఫియా నడిచినట్లు అర్థమవుతోంది. ఇదే అవకాశంగా సదరం సర్టిఫికెట్లను నగదుకు కూడా కొందరు అమ్ముకున్నట్లు తెలుస్తోంది. దీంతో అసలైన లబ్ధిదారులు దివ్యాంగ పింఛన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వంలో ఇటీవల పింఛన్ల పంపిణీ సమయంలో దివ్యాంగ పింఛన్లు అందుకుంటున్న వారిని చూసి ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ఆశ్చర్యపోయారంటే సదరం ఏ స్థాయిలో దుర్వినియోగం చేశారో తెలుసుకోవచ్చు. ఈ పరిస్థితుల్లో నకిలీ సదరం సర్టిఫికేటుగాళ్ల పని పట్టాలని పలువురు కోరుతున్నారు.



గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో దివ్యాంగ పింఛన్ల పరిస్థితి. అనర్హులు ఏళ్ల తరబడి దర్జాగా పింఛన్లు కాజేస్తుంటే, అర్హులు పింఛన్లు దొరక్క నానా అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దివ్యాంగ పింఛన్లు తీసుకుంటున్న వారు వేలల్లో ఉంటే బాధితులు ఎందరో తమకు పింఛన్లు అందడంలేదని తిరగడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఐదేళ్లుగా అటు పాలకులు, ఇటు అధికారులు వారిని కరుణించలేదు. ఎలాంటి వైకల్యం లేకపోయినా సదరం సర్టిఫికెట్లు తీసుకుని వేలాది మంది దివ్యాంగుల పింఛన్లు కైంకర్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏ పనీ చేసుకోలేని దీన స్థితిలో ఉండే దివ్యాంగులు మాత్రం తమకు పింఛను అందజేసి పుణ్యం కట్టుకోవాలంటూ కనిపించిన ప్రతీ అధికారికీ మొక్కుకుంటున్నారు.

వైసీపీ నేతలకే సదరం

వైసీపీ ప్రభుత్వ హయాంలో సదరం సర్టిఫికెట్లు అనేకం దుర్వినియోగం అయ్యాయి. వైకల్యం కారణంగా పనిచేసుకోలేనివారికి ప్రభుత్వం తరఫున చేయూతను అందించడానికి ప్రభుత్వం దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తుంటుంది. ప్రభుత్వ వైద్యులు పరీక్షించి దివ్యాంగులకు సర్టిఫికెట్లు జారీ చేస్తుంటారు. సాధారణంగా 40 శాతానికి మించి వైకల్యం ఉంటేనే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతుంటారు. కాగా ఈ ప్రక్రియను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ శాఖలన్నీ అప్పటి అధికారపార్టీ సేవకే పరిమితమయ్యాయి. అందులో భాగంగా సదరం సర్టిఫికెట్లలో ఎక్కువభాగం వారికే దక్కాయి. వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులకు కుడి భుజాలుగా ఉన్న గ్రామ స్థాయి నాయకులు, వారి కుటుంబసభ్యులు సదరం సర్టిఫికెట్లతో లబ్ధి పొందారు. చాలా చోట్ల వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, వార్డు కౌన్సిలర్లు, మెంబర్లు, వారి బంధువులు, మిత్రులు, వారి అనుచరులు భారీ సంఖ్యలో సదరం సర్టిఫికెట్లు కాజేసినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్లో స్లాట్లు బుక్ చేసుకోవడం, సదరం సర్టిఫికెట్ మాఫియాకి రూ.10 వేలు ఇస్తే వారి పని పూర్తవుతుంది. ఆ తరువాత తతంగమంతా ఆ మాఫియా చూసుకుంటుంది. పరీక్షించే వైద్యులను, ఇతర సిబ్బందిని వారే మెయింటెయిన్ చేసి సదరు వైసీపీ అనుయాయులకు సర్టిఫికెట్లు అందిస్తారు. ఆ వెంటనే తమ పార్టీ పెద్దల సిఫారసుతో వారంతా దరఖాస్తు చేసుకుని పింఛన్లు పొందుతున్నారు.

- పిడుగురాళ్ల మండలం వైరాపురానికి చెందిన ఓ వ్యక్తి ఆర్థోపెడిక్ వైకల్యం 84 శాతం ఉన్నట్లు సర్టిఫికెట్ తీసుకుని మూడేళ్లుగా దివ్యాంగ పింఛను తీసుకుంటున్నాడు. అయితే అతడికి ఎటువంటి వైకల్యం లేదు. అతడు వైసీపీ నేత కావడంతో సదరం సర్టిఫికెట్ తీసుకుని ప్రభుత్వం నుంచి పింఛను అందుకుంటున్నాడు. చెన్నాయపాలెంలో మరో ఇద్దరు ఇలాగే దివ్యాంగుల పేరిట పింఛను కాజేస్తున్నారు.

- ప్రతి రోజూ ఎమ్మెల్యేల వద్దకు పదుల సంఖ్యలో పింఛను దరఖాస్తులు వస్తున్నాయి. వాటిలో మూడో వంతు దివ్యాంగుల పింఛన్లకు సంబంధించినవే. తీవ్ర వైకల్యంతో బాధ పడుతున్నవారే అత్యధికంగా ఉన్నారు. కానీ ఈరోజు వరకూ వారికి సదరం సర్టిఫికెట్లు దొరకలేదు. పింఛను వరం వరించలేదు.



- గుంటూరు జిల్లాలో ఓ ఎమ్మెల్యే దివ్యాంగ మహిళకు రూ.6వేలు పింఛను అందజేశారు. అయితే ఆమెను చూసిన ఎమ్మెల్యే, ఇతర నాయకులు, జిల్లా అధికారులు ఆశ్చర్యపోయారు. ఆమెకు ఎలాంటి వైకల్యం లేదు. కన్ను, కాలు అన్నీ బాగానే ఉన్నాయి. ఆర్థికంగా అత్యంత స్థితిమంతురాలు. అయినా ఆమె గత కొన్నేళ్లుగా దివ్యాంగుల కోటా పింఛను తీసుకుంటోంది. ఈ పరిణామం చూసి విస్తుపోవడం ఎమ్మెల్యే వంతైంది.

19 వేలు నకిలీ పింఛనుదారులు?

తాజాగా వెలుగు చూస్తున్న అంశాలను బట్టి ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల జిల్లాలో భాగమైన చీరాలతో కలిపి మూడు జిల్లాల్లో దాదాపు 19వేల వరకూ నకిలీ దివ్యాంగ పింఛన్లు ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. తాజా పింఛన్ల పంపిణీ సందర్భంగా ఒక్కో ఊరిలో 10 నుంచి 15 దివ్యాంగ పింఛన్లు ఉంటే వాటిలో సగం అనర్హులవేనని సచివాలయ సిబ్బంది గుర్తించారు. విభజిత గుంటూరు జిల్లాలో 25,488 దివ్యాంగ పింఛనుదారులున్నారు. వారికి ఈ నెల 15.29 కోట్లు ప్రభుత్వం అందజేసింది. కానీ 6 వేల మంది పింఛనుదారులు అనర్హులని అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 35,895 మంది దివ్యాంగ పింఛనుదారులు ఉండగా వారికి ఈ నెల 21.537 కోట్లు ప్రభుత్వం పింఛను కింద ఇచ్చింది. వీరిలో మరో 8వేల మంది వరకూ అనర్హులు ఉండవచ్చని ప్రాథమిక అంచనా. కాగా బాపట్ల జిల్లాలో 20 వేల మంది పింఛనుదారులు ఉన్నారు. వారిలో 5 వేల మంది వరకూ అనర్హులు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిని పరిశీలించి, అనర్హులను తొలగించి, అర్హులకు పింఛన్లు జారీ చేయాలి.

తక్కువ ధరకే.. బియ్యం, కందిపప్పు

- కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ వెంకటమురళి
- జిల్లాలో ఆరు చోట్ల ప్రత్యేక కేంద్రాల్లో విక్రయాలు

బాపట్ల, జూలై 11: ప్రజలకు అందుబాటులో నిత్యావసర వస్తువులు ఉంచేందుకు ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు విక్రయాలు చేపట్టినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బాపట్ల తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరు చోట్ల ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి ఫైన్‌రకం స్టీమ్ బియ్యం కిలో రూ.49, ముడి బియ్యం కిలో రూ.48, దేశవాళి కందిపప్పుకు కిలో రూ.160 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రైస్, దాల్ మిల్లర్స్ అసోసియేషన్లు లాభాల్లో కొంత తగ్గించుకుని తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఎవరైనా సరే ఆధార్‌కార్డు చూపించి బియ్యం, కందిపప్పు కొనుగోలు చేయవచ్చన్నారు. తక్కువ ధరకే బియ్యం ఇస్తున్నామని చెప్పి రైతుల వద్ద ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేయరాదన్నారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టిస్తే ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

ప్రజా ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం

ప్రజా ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ తక్షణమే అమల్లోకి తెచ్చారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటలు వరకు ప్రత్యేక కౌంటర్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. అధిక ధరలను నియంత్రించటానికే ప్రభుత్వం బృహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి విలియమ్స్, ఆర్డీవో గంధం రవీందర్, డీటీలు ఓంకార్, శ్రీదేవి, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీవీ.రత్నగుప్తా, బాపట్ల అధ్యక్షుడు కోళ్ళపూడి శివరామప్రసాద్, నాయకులు నల్లమల్లి శ్రీనివాసరావు, తటవర్తి శిరీష, మలిశెట్టి పుల్లయ్య, పవన్‌కుమార్, దేవకి సుబ్రహ్మణ్యం, పివి.రంగారావు, సుధాకర్, టీడీపీ నాయకులు అల్లం గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు బియ్యం, కందిపప్పు అందజేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి విలియమ్స్

ఇసుక.. చౌకగా

- నిర్మాణదారుడికి భారీ ఊరట
- నామమాత్రంగా సీనరేజి, రవాణా చార్జీలు
- నాడు లారీ ఇసుక రూ.50 వేలు.. నేడు రూ.10 వేలు
- గతంలో నిలిపిన భవన నిర్మాణాలకు తాజాగా శ్రీకారం

- ఓ సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలనుకున్నాడు. అందుకోసం దాదాపు 5 లారీల ఇసుక అవసరం అవుతుందని తెలిసింది. ఒక్కో లారీకి రూ.40 వేల నుంచి రూ.50 వేలు చెల్లించాల్సి ఉందని, ఆ ప్రకారం కేవలం ఇసుక కోసమే రూ.2.50 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని అంచనా వేసుకున్నాడు. డబ్బంతా ఇసుకకే ఖర్చవుతుందని, ఇటుక, ఇనుము, కలప, కూలీలకు డబ్బు లేకుండా పోతుందని భావించాడు. దీంతో అతడి సొంతింటి కల అర్ధాంతరంగా ఆగిపోయింది.
  - ఇది నాటి వైసీపీ పాలనలో పరిస్థితి

- అదే సామాన్యుడు ఇప్పుడు తన ఇంటి నిర్మాణానికి కావాల్సిన 5 లారీల ఇసుకకు రూ.50 వేలు మాత్రమే ఖర్చు చేయనున్నాడు. గతంలో ఒక లారీకి పెట్టే ఖర్చుతో ఇప్పుడు ఐదు లారీల ఇసుక వస్తుందని అతడు అంచనా వేసుకున్నాడు. ఒక్క ఇసుకలోనే రూ.2 లక్షల ఖర్చు తగ్గనున్నదని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.
  - ఇది ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పరిస్థితి

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనకు.. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు ఇసుక విషయంలో మార్పు రావడంతో సామాన్యుడి సొంతింటి కల ఇంకెంతో దూరంలో లేదని స్పష్టమవుతుంది. వైసీపీ హయాంలో రూ.50 వేలు ఇచ్చినా దొరకని ఇసుక ఈ రోజు పదివేలకే వస్తుంది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అంతకముందు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత విధానాన్ని రద్దు చేసింది. కొత్త పాలసీ తీసుకు వస్తామని నాటి సీఎం జగన్ దాదాపు 8 నెలలు ఇసుక అందకుండా చేశారు. ఆ తర్వాత ఇసుక పాలసీ తెచ్చినా సామాన్యులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పైగా వారిని ఇసుక పేరుతో వైసీపీ నాయకులు నిలువు దోపిడీ చేశారు. లారీ ఇసుక రూ.25 నుంచి 40వేల వరకూ వెళ్లింది. బ్లాక్ మార్కెట్, ఇసుక మాఫియా పుణ్యమా అని రూ.50 వేలు కూడా చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. ట్రాక్టరు ఇసుక కనీసంగా రూ.5 వేలు, గరిష్ఠంగా 10 వేల వరకూ వెళ్లింది. దీంతో నిర్మాణరంగం కుదేలైంది. కూలీలు పనులు లేక అల్లాడిపోయారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంతో లారీ ఇసుక రవాణా చార్జీలతో కలిపి రూ.9 నుంచి 10 వేలకే తన గుమ్మంలోకి వస్తోందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టరు ఇసుక రూ.2 వేలకే వస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టన్ను ఇసుకకు రూ.2000 నుంచి 2500 వరకూ ఖర్చు చేయాల్సిరాగా, ఇప్పుడు అది కేవలం రూ.265కే వస్తోంది. టన్ను ఇసుకకు సీనరేజి కింద రూ.88 చెల్లించాలి. ఇసుక తవ్వినందుకు కాంట్రాక్టు సంస్థలకు టన్నుకు రూ.30 చెల్లించాలి. నిర్వహణ వ్యయం కింద రూ.20 చెల్లించాలి. రీచ్ నుంచి స్టాక్ పాయింట్లకు ఇసుక తరలింపునకు కిలో మీటరుకు రూ.4.90 రవాణా చార్జీగా నిర్ణయించారు. అదే ఇసుకను వినియోగదారుడు రీచ్ నుంచి తెచ్చుకుంటే రూ.4.90 చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఆ మొత్తానికి వినియోగదారు 18 శాతం జీఎస్టీ చెల్లించాలి.

పనులకు శ్రీకారం.. కూలీలకు ఉపాధి

వైసీపీ హయాంలో ఇసుక కారణంగా నిర్మాణదారుల కష్టాలు, ఉపాధి కోల్పోయి కూలీలు పడిన ఆర్థిక బాధలను పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీని అమలు చేశారు. తొలి రెండు మూడు రోజుల్లోనే లక్షలాది మెట్రిక్ టన్నుల ఇసుక జన సామాన్యానికి అందుబాటులోకి వచ్చింది. సామాన్యులు ఇప్పటి వరకు ఆపేసుకున్న నిర్మాణాలకు తిరిగి శ్రీకారం చుట్టారు. కూలీలు, మేస్త్రీలు పనుల్లో బిజీగా మారారు. గత ప్రభుత్వ హయాంలో టన్ను ఇసుక రూ.2 వేల నుంచి రెండున్నర వేలు ఉండగా అది ఇప్పుడు 265 రూపాయలకే సామాన్యుల గడప వద్దకు వచ్చి పడుతోంది.

ఓర్వలేక విష ప్రచారం..

ప్రస్తుత ఇసుక పాలసీకి వస్తున్న అనూహ్య స్పందనను చూసి ఓర్వలేని వైసీపీ విష ప్రచారానికి తెరతీసింది. తప్పుడు కథనాలు, వ్యాఖ్యానాలతో సామాజిక మాధ్యమాల ద్వారా విషం చిమ్ముతోంది. స్థానిక సంస్థలకు చెల్లించే సీనరేజిని, ఇసుక రవాణా నిమిత్తం అయ్యే ఖర్చులను ఆసరా చేసుకుని దారుణమైన తప్పుడు ప్రచారానికి వైసీపీ తెగబడుతోంది. వైసీపీ విష ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి కనిపించడంలేదు. వైసీపీ హయాంలో రూ.50 వేలకు లారీ ఇసుక కొన్నవాళ్లు, భారం మోయలేక పనులు ఆపేసుకున్నవాళ్లు అధికంగా ఉండడంతో వైసీపీ దుష్ప్రచారాన్ని వారే తిప్పికొడుతున్నారు.



ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా

- బాధ్యతలు స్వీకరించిన జేసీ సుబ్బారావు

బాపట్ల, జూలై 11: ప్రజల ఆనందం ప్రభుత్వ లక్ష్యం కాబట్టి దానికి అనుగుణంగా పనిచేస్తానని జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా గురువారం బాధ్యతలు చేపట్టిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్ని విషయాల్లో ప్రజలకు న్యాయం జరిగేలా చూడడం తన బాధ్యత అన్నారు. గ్రీవెన్స్ కార్యక్రమాలలో అత్యధికంగా రెవెన్యూ సమస్యలతోనే అర్జీలు వస్తున్నాయని వాటిని తక్షణమే పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూశాఖపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. 2017 ఐఏఎస్ బ్యాచ్‌లో ఎంపికైనా జాయింట్ కలెక్టర్‌గా తొలిసారిగా బాపట్లలోనే బాధ్యతలు చేపట్టానన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సీఈవోగా చేసిన అనుభవంతో అన్ని మండలాలు గురించి తెలుసుకాబట్టి ఖచ్చితంగా కష్టపడి పనిచేస్తానన్నారు. బాధ్యతలు చేపట్టే ముందు కలెక్టర్ జె.వెంకటమురళిని జేసీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జేసీని ఆర్డీవోలు గంధం రవీందర్, జి.సూర్యనారాయణరెడ్డి, హేలాషారోను, ఏఈవో లక్ష్మీకుమారి, తహసీల్దార్‌లు, కలెక్టరేట్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.



జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్న బి.సుబ్బారావు

హరే కృష్ణ.. హరే రామ్

- మంగళగిరిలో వైభవంగా జగన్నాథ రథయాత్ర
- రథయాత్రను ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, జూలై 11: ఇస్కాన్ ఆధ్వర్యంలో మంగళగిరిలో శ్రీ జగన్నాథుని రథయాత్ర గురువారం అత్యంత వైభవంగా సాగింది. జై జగన్నాథ్, హరేకృష్ణ, హరేరామ్ నినాదాలతో మంగళగిరి పురవీధులు మార్మోగాయి. తొలుత జగన్నాథుడు, బలరాముడు, సుభద్రల విగ్రహాలకు హారతులిచ్చిన మంత్రి లోకేశ్... అనంతరం రథాన్ని లాగి రథయాత్రను ప్రారంభించారు. రథానికి ముందు సంప్రదాయబద్ధంగా బంగారు చీపురుతో రహదారి మార్గాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ ప్రజా సేవ అంటే పరమాత్ముడి సేవ అన్నారు. ఇప్పుడు అందరి దృష్టి మంగళగిరి వైపే ఉందని, ఆ దేవుడి ఆశీస్సులతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని తెలిపారు. మంగళగిరి నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మంగళగిరి బస్టాండు నుంచి బైపాస్ రోడ్డులోని ఆత్మకూరు బాపూజీ విద్యాలయం వరకు రథయాత్ర సాగింది. దారిపొడవునా జగన్నాథ రథం ముందు భక్తులు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ఆనంద పారవశ్యంలో మునిగిపోయారు. ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు ఒడిశాలోని పిప్లి నుంచి తెప్పించిన రంగుల పందిరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కోలాట ప్రదర్శనలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, బాపూజీ అకాడమీ చైర్మన్ యర్రాకుల తులసీరామ్, పిరమిడ్ ధ్యాన మండలి అధ్యక్షుడు ఆకురాతి శంకరరావు, బలరామ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు పల్లెబాట రాజా, సువర్ణ శ్రీనివాస దాస్, ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



జగన్నాథుడు, బలరాముడు, సుభద్రల విగ్రహాలకు హారతి ఇస్తున్న మంత్రి నారా లోకేశ్



మంగళగిరి ఇస్కాన్‌కు వచ్చిన ఇండియన్ వరల్డ్ రికార్డును మంత్రి లోకేశ్‌కు చూపుతున్న ఇస్కాన్ ప్రతినిధులు

దిక్సూచి DIKSUCHI

ఎన్‌జీ రంగా వర్సిటీలో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్‌ఏయూ)- బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అకడమిక్ మెరిట్ ఆధారంగా లాంలోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ కాలేజీకి ఐకార్ గుర్తింపు ఉంది. మొత్తం 83 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కోసం 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు. గ్రామీణ అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంపీసీ/ఎంబైపీసీ గ్రూప్ సబ్జెక్టులతో ఇంటర్/ పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

- మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా(హోం సైన్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థుల కోసం పది శాతం సూపర్ న్యూమరరీ సీట్లు(ఎనిమిది సీట్లు) ప్రత్యేకించారు. గ్రామీణ అభ్యర్థులకు కేటాయించిన సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే ఒకటోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు కనీసం నాలుగేళ్లు గ్రామ పాఠశాలల్లో చదివి ఉండాలి. సంబంధిత ధ్రువపత్రాన్ని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.



- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్ల మించకూడదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు - 522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

ఇగ్నోలో ఓడీఎల్ కోర్సులు

న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో)- ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సులు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన అర్హతల సమాచారాన్ని వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అడ్వాన్స్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, పవర్ డిస్ట్రిబ్యూషన్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అప్రిసియేషన్ కోర్సు: కోర్సు వ్యవధి మూడు నెలలు.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు.

డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బిజినెస్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్, క్రియేటివ్ రైటింగ్ ఇన్ ఇంగ్లీష్, డెయిరీ టెక్నాలజీ, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, ఫ్యాషన్ డిజైన్ అండ్ రిటైల్, హార్టికల్చర్, మీట్ టెక్నాలజీ, మోడరన్ ఆఫీస్ ప్రాక్టీస్, న్యూట్రిషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్, పారాలీగల్ ప్రాక్టీస్, థియేటర్ ఆర్ట్స్, టూరిజం స్టడీస్, ఉర్దూ, వాల్యూ ఎడ్యుకేషన్, వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్, ఉమన్ ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, అగ్రికల్చరల్ అండ్ కాస్ట్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ మర్చండైజింగ్, రిటైలింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బీఏ, బీఏ ఆనర్స్, బీటీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీకాం, బీఎస్‌డబ్ల్యూ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ వ్యవధి ఏడాది.

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంటీటీఎం, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎంఎల్‌ఐఎస్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. అనలిటికల్ కెమిస్ట్రీ, కౌన్సెలింగ్ అండ్ ఫ్యామిలీ థెరపీ, గాంధీ అండ్ పీస్ స్టడీస్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, యానిమల్ వెల్ఫేర్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, ఆడియో ప్రోగ్రామ్ ప్రొడక్షన్, బుక్ పబ్లిషింగ్, కార్పొరేట్ అండ్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, డెవలప్‌మెంట్ స్టడీస్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషనల్ టెక్నాలజీ తదితర స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

పీజీ సర్టిఫికెట్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. అగ్రికల్చర్ పాలసీ, క్లయిమేట్ ఛేంజ్, జియో ఇన్ఫర్మాటిక్స్, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఇన్వెంటరీ ప్లానింగ్ అండ్ వేర్ హౌసింగ్ సిస్టమ్ ఫర్ ఇంజనీర్స్, మలయాళం-హిందీ ట్రాన్స్‌లేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **వెబ్‌సైట్:** ignouadmission.samarth.edu.in

ఎన్‌పీటీఐలో పీజీ డిప్లొమాలు

ఫరీదాబాద్‌లోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు. మహిళలకు ప్రోగ్రామ్ ఫీజులో పది శాతం రాయితీ లభిస్తుంది. పవర్ సంస్థలు స్పాన్సర్ చేసే అభ్యర్థుల కోసం 25 శాతం సీట్లు కేటాయించారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందించి కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

పీజీ డిప్లొమా ఇన్ పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి ఏడాది. ఫరీదాబాద్, నాగ్‌పూర్, నైవేలీ, దుర్గాపూర్, అలప్పుజా, శివ్‌పురి సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఒక్కో సెంటర్లో 60 సీట్లు చొప్పున మొత్తం 360 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ హైడ్రో పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి తొమ్మిది నెలలు. నంగల్ సెంటర్లో ఈ ప్రోగ్రామ్ ఉంది. ఇక్కడ 60 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్: కోర్సు వ్యవధి ఏడాది. న్యూఢిల్లీ, శివ్‌పురి, నైవేలీ, అలప్పుజా సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ ఉంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో (బీఈ/బీటెక్)(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/సీ అండ్ ఐ/పవర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ కోర్సుకు ఏ ఇంజనీరింగ్ విభాగంవారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **టెలిఫోనిక్ ఇంటర్వ్యూ:** జూలై 30, 31
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** ఆగస్టు 2
- **కౌన్సెలింగ్:** ఆగస్టు 5, 6
- **కోర్సులు ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 22
- **వెబ్‌సైట్:** www.npti.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/V9yZi4uలో చదవండి.

సెప్టెంబర్ ఒకటిన బాలకృష్ణకు భారీ సన్మానం



'తాతమ్మ కల' (1974) చిత్రంతో తన నట జీవితాన్ని ప్రారంభించారు నందమూరి బాలకృష్ణ. వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ 50 ఏళ్లుగా హీరోగా కొనసాగుతున్న ఏకైక కళాకారుడు ప్రపంచంలో ఆయన ఒక్కరే అంటే అది అతిశయోక్తి కాదు. అంతేకాదు తండ్రి, మహానటుడు ఎన్టీఆర్ మార్గాన్ని అనుసరించి రాజకీయాల్లోకి ప్రవేశించి హిందూపురం నియోజక వర్గం నుంచి మూడు సార్లు వరుసగా శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. ఇలా సినీరంగంలోనూ, రాజకీయ రంగంలోనూ సత్తా చాటుతూ 50 ఏళ్ల కెరీర్ పూర్తి చేసుకున్న బాలకృష్ణను తెలుగు చిత్రపరిశ్రమ సెప్టెంబర్ ఒకటిన ఘనంగా సత్కరించనుంది. ఈ మేరకు తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి దామోదర ప్రసాద్, నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు సునీల్ నారంగ్, ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కలవగా, బాలకృష్ణ ఈ సన్మానానికి తన అంగీకారం తెలిపారు. బాలీవుడ్, ఇతర సినీ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఈ సన్మాన సభకు హాజరవుతారని సమాచారం.

షూటింగ్ మొదలుపెట్టారు



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న తాజా చిత్రం రెగ్యులర్ షూటింగ్ గురువారం మొదలైంది. వెంకటేశ్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఓ పోలీస్ ఆఫీసర్, ఆయన భార్య, మాజీ ప్రేయసి.. ఇలా మూడు పాత్రల చుట్టూ తిరిగే వినోద భరిత చిత్రమిదని, ఇందులో క్రైమ్ ఎలిమెంట్ కూడా మిళితమై ఉంటుందని దర్శకుడు అనిల్ రావిపూడి చెప్పారు. ప్రస్తుతం ప్రారంభమైన షూటింగ్‌లో చిత్రంలోని ముఖ్య తారాగణమంతా పాల్గొంటోంది. ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాత శిరీష్ చెప్పారు. దిల్ రాజు ఈ సినిమాకు సమర్పకుడు. ఈ చిత్రానికి సమీర్‌రెడ్డి ఛాయాగ్రాహకుడు, భీమ్స్ సిసిరోలియో సంగీత దర్శకుడు.

ఉత్తమ నటులుగా ఎన్టీఆర్, రామ్‌చరణ్ ఉత్తమ నటిగా సాయి పల్లవి

ఫిల్మ్‌ఫేర్ సౌత్ ఇండియన్ అవార్డుల సందడి





జాతీయ చలనచిత్ర అవార్డుల తర్వాత భారతీయ చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠాత్మకంగా భావించే ఫిల్మ్‌ఫేర్ సౌత్ ఇండియన్ అవార్డులను గురువారం ప్రకటించారు. అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు పొందిన 'ఆర్ ఆర్ ఆర్' చిత్రం తెలుగు విభాగంలో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఉత్తమ నటులుగా ఎన్టీఆర్, రామ్‌చరణ్, ఉత్తమ దర్శకుడిగా రాజమౌళి ఎన్నికయ్యారు. 'విరాటపర్వం' చిత్రంలో నటించిన సాయిపల్లవి ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. 'భీమ్లా నాయక్'లో నటించిన రానా ఉత్తమ సహాయ నటుడిగా, 'విరాటపర్వం'లో నటించిన నందితా దాస్, 'సీతారామం'లో నటించిన మృణాల్ ఠాకూర్ ఉత్తమ సహాయ నటీమణులుగా, ఉత్తమ గేయ రచయితగా సీతారామశాస్త్రి (సీతారామం) ఎన్నికయ్యారు. తమిళంలో ఉత్తమ నటుడిగా కమల్ హాసన్ (విక్రమ్) ఉత్తమ నటిగా ఊర్వశి, ఉత్తమ చిత్రంగా పొన్నియిన్ సెల్వం 1', ఆ సినిమాకు దర్శకత్వం వహించిన మణిరత్నం ఉత్తమ దర్శకుడిగా ఎన్నికయ్యారు. కన్నడంలో 'కాంతార', మలయాళంలో 'న్నా థాన్ కేసు కుడు' ఉత్తమ చిత్రాలుగా ఎన్నికయ్యాయి.

వినోదాత్మకంగా డార్లింగ్



అశ్విన్‌రామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'డార్లింగ్'. ప్రియదర్శి, నభానటేశ్ జంటగా నటించగా, కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అశ్విన్‌రామ్ మీడియాతో ముచ్చటించారు. "కొత్త జంట పెళ్లిని ఎలా హ్యాండిల్ చేస్తారనేది ఇందులో వినోదాత్మకంగా చూపించా. సినిమాల ద్వారా సందేశాలు ఇవ్వడం నాకు ఇష్టం ఉండదు. ఈ సినిమాలో ఎంటర్టైన్‌మెంట్‌తో పాటూ ఓ సామాజిక బాధ్యతను కూడా జత చేశా. ఇందులో కథానాయకుడి పాత్ర చాలా అమాయకంగా.. కథానాయిక పాత్ర చలాకీగా ఉండాలి. అలా ఆ పాత్రలకి సరిపోయే నటీనటులను పరిశీలించాక.. ప్రియదర్శి, నభానటేశ్ వందశాతం సరిపోతారని అనిపించి వారిని తీసుకున్నాం. నభా పాత్రలో చాలా షేడ్స్ ఉంటాయి.. సినిమాలో నభా మీ అందరినీ పూర్తిగా ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వినోదంతో పాటు భావోద్వేగాలని సమపాళ్లలో మిక్స్ చేసి తీసిన ఈ సినిమాలో.. హీరో హీరోయిన్ల మధ్యన వచ్చే సన్నివేశాలు అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు.

అద్భుతమైన విజువల్స్‌తో..



వరుణ్ సందేశ్ నటిస్తున్న చిత్రం 'విరాజీ'. ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. ఆగస్టు 2న సినిమా విడుదలవుతుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ టీజర్‌ను దర్శకుడు సాయి రాజేశ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "టీజర్‌లో విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. వరుణ్ లుక్ అదిరిపోయింది" అని చెప్పారు. "ఈ చిత్రం నాకు చాలా స్పెషల్" అని వరుణ్ సందేశ్ అన్నారు. "ఈ సినిమాలో చాలా ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి. వాటిని థియేటర్లలో చూసి ఆశ్చర్యపోతారు" అని దర్శకుడు ఆద్యంత్ హర్ష తెలిపారు.

ముందు రిసెప్షన్.. తర్వాత పెళ్లి!



వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ మంచి నటిగా తెలుగువారికి దగ్గరైన తమిళ నటి వరలక్ష్మి తన పెళ్లి వేడుకలోనూ వైవిధ్యం చూపించారు. వారం రోజుల క్రితం చెన్నైలో వరలక్ష్మి, నికోలై సచిదేవ్‌ల పెళ్లి రిసెప్షన్ చెన్నైలో జరిగింది. ఈ వేడుకకు పలువురు చిత్ర ప్రముఖులు హాజరయ్యారు. ఇలా అందరి అభినందనలు అందుకున్న వరలక్ష్మి, నికోలై సచిదేవ్ మంగళవారం థాయ్‌లాండ్‌లోని క్రాబి బీచ్ రిసార్ట్‌లో పెళ్లి చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, అతికొద్దిమంది సన్నిహితుల మధ్య తమిళ సంప్రదాయానికి అనుగుణంగా ఈ పెళ్లి జరిగింది.

అనౌన్స్‌మెంట్ వీడియోతోనే సంచలనం



సత్యం రాజేశ్, బాలాదిత్య, గెటప్ శ్రీను ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'పొలిమేర 2' బాక్సాఫీస్ వద్ద ఊహించని సక్సెస్‌ను అందుకుని హారర్ థ్రిల్లర్ జానర్ సినిమాల్లో సరికొత్త ట్రెండ్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. 2021లో 'మా ఊరి పొలిమేర' చిత్రం ఓటీటీ సంస్థ 'డిస్నీ ప్లస్ హాట్‌స్టార్'లో విడుదలై అందరినీ మెప్పించింది .'మా ఊరి పొలిమేర'కు సీక్వెల్‌గా వచ్చిందే 'పొలిమేర 2'. గతేడాది నవంబరులో విడుదలైన ఈ సక్సెస్‌ఫుల్ హారర్ థ్రిల్లర్ ఫిల్మ్‌కు కొనసాగింపుగా ఇంకో భాగం ఉంటుందని మేకర్స్ అప్పుడే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించారు. తాజాగా, 'పొలిమేర 3'ను మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో సంచలనం సృష్టిస్తోంది. ఈ వీడియో రిలీజైన కొద్దిసేపటికే ఎక్స్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతూ టాప్ ప్లేస్‌ను ఆక్రమించింది. మూడో భాగాన్ని మొదటి రెండు పార్టులకు దర్శకత్వం వహించిన అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించనున్నారు. భోగేంద్ర గుప్తా, వంశీ నందిపాటి సంయుక్తంగా నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉన్నట్లు మేకర్స్ వెల్లడించారు. 'పొలిమేర 3' లో సత్యం రాజేష్, బాలాదిత్య కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రవి వర్మ, రాకేందు మౌళి, చిత్రం శ్రీను, సాహిత్య దాసరి ప్రధాన పాత్రల్లో నటించనున్నారు.







ఏఎన్‌యూ డిగ్రీ 4వ సెమిస్టర్
పరీక్ష ఫలితాలు విడుదల

పెదకాకాని, జూలై 11 : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఏప్రిల్ లో నిర్వహించిన డిగ్రీ నాలుగవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఫలితాలను గురువారం తాత్కాలిక రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్య కోల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదనపు పరీక్షల నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాష్ మాట్లాడుతూ బీకాం, బీఎస్సీ, బీఏ, బీసీఏ, బీబీఏ, బీఏవోఎల్ కోర్సుల ఫలితాలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రీ వాల్యూయేషన్ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఈనెల 25వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1240 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ పరీక్షలకు 14,544 మంది హాజరు కాగా 8439 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్ సైట్‌లో పొందుపరిచినట్లు రెడ్డి ప్రకాష్ వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బీ.సత్యనారాయణ, డాక్టర్ సుధాకర్, డాక్టర్ భబిత తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట పురపాలక సంఘం

Roc.No. 370/Works/2022/E1 Date: 11.07.2024

E-Procurement Notice

I 1. **Number of Works: 5 (New)**
2. **Estimate Contract Value : 85,26,368/-**
3. **Name of Work: -** Repair and renovation of Anna canteens at various places, development of Compost yard and Rapid filling arrangements for filling of SS tanks with canal water under 15th FC, General funds and special grant.
4. Bid Document Download Start Date : 12.07.2024 11.00 AM
5. Bid Document Download End Date : 15.07.2024 4.00 PM
6. Bid Submission closing date : 15.07.2024 4.30 PM

II 1. **Number of Works: 17 (New)**
2. **Estimate Contract Value: 69,48,071/-**
3. **Name of Work: -** Supply of man mazdoor for dividers and parks. Pushcarts, hydraulic tipper, hired water tankers 4000ltr capacity. Supply of chlorine gas cylinders and Removal of wet silt at various places in chilakaluripet Municipality.
4. Bid Document Download Start Date : 12.07.2024 11.00 AM
5. Bid Document Download End Date : 19.07.2024 4.00PM
6. Bid Submission closing date : 19.07.2024 04.30PM
7. Name and address of the office : **Sri.Ch.Govinda Rao,** Commissioner, Chilakaluripet Municipality Phone: 08647-253994, 9849906585.

For other details visit **https://tender.apeprocurement.gov.in**

స్వచ్ఛ భారత్.... స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ .... స్వచ్ఛ చిలకలూరిపేట

Sd/- **Commissioner, Chilakaluripet Municipality**

లోకేశ్ ప్రజా దర్బార్‌కు అనూహ్య స్పందన



దివ్యాంగుడి నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న నారా లోకేశ్

- 16వ రోజు భారీగా తరలివచ్చిన ప్రజలు
- బాధితులకు భరోసా ఇస్తున్న మంత్రి లోకేశ్
- సమస్యలను మెయిల్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి

తాడేపల్లి, జూలై 11: సామాన్య ప్రజానీకం పడుతున్న కష్టాలు వారి సమస్యల పరిష్కారం కోసం మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. ఉండవల్లి నివాసంలో గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు మంగళగిరి నియోజకవర్గం నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు తరలిరావడంతో ఉండవల్లి కరకట్ట అర్జీదారులతో నిండిపోయింది. లోకేశ్ ప్రతి ఒక్కరి కష్టాన్ని వింటూ వారికి భరోసానిస్తూ అర్జీలను సంబంధిత శాఖలకు పరిష్కారం నిమిత్తం పంపుతున్నారు.

వైసీపీ రేషన్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

- మంగళగిరి నియోజకవర్గంలో రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడుతున్న వైసీపీ నేతలు,సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని పీ.నాగ సురేష్ మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. పలువురు అధికారులు ఎండీఏ ఆపరేటర్లను మేనేజ్ చేస్తూ రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడుతున్నారని విచారిస్తే విషయాలు వెలుగులోకి వస్తాయని కోరారు.
- సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని మంగళగిరికి చెందిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పలువురు లోకేశ్‌ను కోరారు.
- ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు రేషన్ కార్డుతో పాటు పెన్షన్ ఆరోగ్యశ్రీ సదుపాయాలు కల్పించాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.
- రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా గ్రామీణాభివృద్ధి, సెర్ప్ సంస్థల్లో పని చేస్తున్న మండల వ్యవసాయ నిపుణులను కొనసాగించాలని ఆశాఖ సిబ్బంది కోరారు.
- ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసం ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.
- రాష్ట్రంలో కూటమి అఖండ విజయం సాధించడంపై యర్రబాలెం గ్రామానికి చెందిన మహిళా రైతులు మాజీ జడ్పీటీసీ ఆకుల జయసత్య నేతృత్వంలో గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకుని అనంతరం ఉండవల్లిలో నారా లోకేశ్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

సమస్యలను పర్సనల్ మెయిల్ ఐడీకి పంపండి : మంత్రి లోకేశ్

ప్రజల నుంచి వరదలా వచ్చిన మెసేజ్‌లతో సాంకేతిక సమస్య తలెత్తిన కారణంగా తన వాట్సాప్‌ను మెటా బ్లాక్ చేసిందని, దయచేసి సమస్యలు వాట్సాప్ చేయవద్దని మంత్రి లోకేశ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమస్య ఏదైనా సహాయం కావాలన్నా ఇక నుంచి తన పర్సనల్ మెయిల్ ఐడీ hello.lokesh@apgov.in కు పంపాలని విజ్ఞప్తి చేశారు. పేరు, ఊరు, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ, సమస్య సహాయానికి సంబంధించిన పూర్తి వివరాలు వినతులతో పొందుపరిచి మెయిల్ చేయాలని కోరారు. అనంతరం ఆయా సమస్యకు సహాయం చేయడం, పరిష్కారం చూపటం వంటి బాధ్యత తాను తీసుకుంటానని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.





అర్జీలు స్వీకరిస్తున్న నారా లోకేశ్

వందేభారత్‌కు పిడుగురాళ్లలో స్టాపేజీ కల్పించాలి

- దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి



దక్షిణ మధ్య రైల్వే జీఎంతో చర్చిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ - తిరుపతి - సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కి పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లో నిలుపుదల సౌకర్యం కల్పించాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కి విజ్ఞప్తి చేశారు. అలాగే విజయవాడ నుంచి బెంగుళూరు వరకు నరసరావుపేట, వినుకొండలో స్టాప్‌లతో కొత్త వందేభారత్ రైలుని ప్రారంభించాలని కోరారు. గురువారం రైల్వే సమస్యలు పరిష్కారం కోరుతూ హైదరాబాదులోని రైల్ నిలయంలో పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రుణ్‌కుమార్ జైన్‌కు అందజేశారు. పల్నాడు ప్రజలకు మేలు కలిగేలా పెదకూరపాడు రైల్వేస్టేషన్‌లో పల్నాడు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు స్టాపేజీని ఇవ్వాలని, సత్తెనపల్లి స్టేషన్‌లో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌కు నిలుపుదల కల్పించాలని, విశాఖపట్నం నుంచి గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలును పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేసారు. పేరేచర్ల నుంచి గన్నవరం/పెదవుటపల్లికి కొత్త ఎంఎంటీఎస్ రైలు సేవలను పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పల్నాడు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ విజయవంతంగా 25 సంవత్సరాల సేవలను పూర్తి చేసుకుందని, ప్రస్తుతం ఉన్న బోగీలను వందే భారత్ రైళ్ల ప్రమాణాలతో మార్చాలని కోరారు. కొత్త జిల్లా పల్నాడులో ఆర్‌వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని, కొత్తవి మంజూరుచేయాలని కోరారు. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ, మాచర్ల, నడికుడి రైల్వే స్టేషన్లను ప్రతిష్టాత్మకమైన అమృత్ భారత్ స్టేషన్ పథకం ఆధునికీకరణ చేపట్టాలని కోరారు.

రైతుబజారులో రాయితీపై కంది పప్పు, బియ్యం

- పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే పుల్లారావు, కలెక్టర్ అరుణ్‌బాబు
- రైతు బజారులలో అందుబాటులో నిత్యావసరాలు



వినియోగదారుడికి కందిపప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, కలెక్టర్

చిలకలూరిపేట, జూలై 11 : చిలకలూరిపేట రైతు బజారులో రాయితీపై కంది పప్పు, బియ్యం విక్రయాలను స్థానిక శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు, పల్నాడుజిల్లా కలెక్టర్ అరుణ్ బాబుతో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో కిలోకు రూ.180 ధర పలుకుతున్న కంది పప్పును రైతు బజారులో రూ.160 లకు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. నిత్యవసర సరుకుల ధరలను దశలవారీగా తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే కంది పప్పు, బియ్యం విక్రయ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ధరల నియంత్రణ కోసం మిల్లర్లు, వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించామన్నారు. తొలి దశలో కంది పప్పుపై కిలోకు రూ.21 తగ్గించినట్టు తెలిపారు. ఒక్కొక్కరికి ఐదు కిలోల బియ్యం, కిలో కంది పప్పు ఇస్తారని తెలిపారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ప్రారంభించిన ఈ విక్రయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే మాల్స్‌లతో పాటు ఇతర దుకాణాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే నిత్యావసరాల విక్రయాలు జరపాలని కలెక్టర్ కోరారు.

మనస్థాపంతో మహిళ ఆత్మహత్య

- అప్పు చెల్లింపులో బాధ్యత తీసుకోని భర్త
- పోలీసులను ఆశ్రయించిన బాధిత మహిళ
- న్యాయం చేయలేదని పురుగు మందు తాగిన వైనం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



రోడ్డుపై ధర్నా చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు



శోభారాణి (ఫైల్)

బాపట్లరూరల్, జూలై 11: పోలీసులు తనకు న్యాయం చేయలేదంటూ ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం వెదుళ్ళపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. బాపట్ల మండలం వెదుళ్ళపల్లి కొత్తపాలెం పంచాయతీ వడ్డెరపాలెం గ్రామానికి చెందిన బత్తుల శోభారాణి (30) అనే మహిళ కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామానికి చెందిన బత్తుల వెంకట్రావు అనే వ్యక్తితో 5 సంవత్సరాలు క్రితం వివాహమైంది. అయితే భార్యభర్తల మధ్య గొడవలు రావటంతో రెండేళ్ళ క్రితం శోభారాణి తన పుట్టింటికి వచ్చేసింది. అయితే వీరిద్దరు కలిసివున్న సమయంలో రూ.3 లక్షలు అప్పు తీసుకున్నారని, ఇప్పుడు ఆ అప్పుకు నాకు సంబంధం లేదని భర్త వెంకట్రావు అడ్డం తిరిగాడు. అయితే అప్పులు వాళ్ళు అతనిని పట్టుకొని అతని ఆటోను వెదుళ్ళపల్లి పోలీసులకు అప్పగించారు. భార్య శోభారాణియే తనను, ఆటోను పోలీసులకు పట్టించిందన్న కోపంతో భార్యపై అతడు కేసు పెట్టాడు. దీంతో శోభారాణి గ్రామంలోని పెద్ద మనుషులను తీసుకొని పోలీసుస్టేషన్‌కు వెళ్లి మాట్లా డగా.. 'నీకు తప్పకుండా న్యాయం చేస్తాం' అని పోలీసులు తెలిపారు. అయితే పోలీసులు తన భర్తను, ఆటోను వదిలేయటంతో ఇదేంటని ఆమె పోలీసులను అడగగా సమాధానం లేకపోవడంతో మనస్థాపానికి గురై పురుగు మందు తాగింది. స్థానికులు వెంటనే బాపట్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా చికిత్సపొందుతూ ఆమె మృతి చెందింది. దీంతో మృతురాలి కుటుంబసభ్యులు శోభారాణికి పోలీసులు అన్యాయం చేశారంటూ రోడ్డుపై ధర్నా చేపట్టారు. బాపట్లరూరల్ సీఐలు హజరత్‌బాబు, శ్రీహరిలు కుటుంబ సభ్యులతో మాట్లాడి తప్పకుండా న్యాయంచేస్తామని హామినివ్వటంతో ధర్నాను విరమించుకున్నారు. ఈ ఘటనపై రూరల్ సీఐ హజరత్‌బాబును వివరణ కోరగా బత్తుల శోభారాణి, వెంకట్రావులు కలిసి ఉన్నప్పుడు రూ.3లక్షలు అప్పుచేశారని, అనంతరం వారు విడిపోవటంతో భర్త వెంకట్రావు అప్పుకట్టనని చెప్పగా అతను నడిపే ఆటోను అతడి భార్య వడ్డెరపాలెం తీసుకు వచ్చిందని, అయితే ఆ ఆటో వెంకట్రావుది కాకపోవటంతో ఆటో ఓనర్ వెదుళ్ళపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వెదుళ్ళపల్లి పోలీసులు ఆటోను ఓనర్‌కు అందజేశారని, దీంతో ఆ మహిళ మనస్థాపానికి గురై పురుగు మందు తాగి మృతి చెందిందని సీఐ తెలిపారు.

మద్యం తాగొద్దన్నందుకు పురుగు మందు తాగాడు..

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి



శ్రీనివాసరావు మృతదేహం

ప్రత్తిపాడు, జూలై 11: మద్యానికి పూర్తిగా బానిసైన భర్తను తాగుడుమానుకోమని భార్య హెచ్చరించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన భర్త పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడులో జరిగింది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన కోండ్రుపాడు గ్రామానికి చెందిన వల్లపు శ్రీనివాసరావు (32) తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అతనికి భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే పూర్తిగా మద్యానికి బానిసైన భర్తను 'పిల్లలు పెద్ద వాళ్లు అవుతున్నారు.. ఇక తాగుడు మానుకోవాలి' అంటూ భార్య మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన శ్రీనివాసరావు గడ్డి మందు తాగాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు శ్రీనివాసరావును దగ్గరలోని కాటూరి వైద్య కళాశాల ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అనంతరం చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు ప్రత్తిపాడు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరిన ఎమ్మెల్యే ప్రవీణ్



ఆర్థిక మంత్రి పయ్యావులకేశవ్‌తో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, జూలై 11 : పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక మంత్రిని ఎమ్మెల్యే ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ పరిస్థితిని వివరించి, అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు భాష్యంప్రవీణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయం, రోడ్లు, తాగునీటి పథకాల అమలుకి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని కోరినట్టు తెలిపారు. నియోజక వర్గంలో కాలువ చివరి భూములు అధికంగా ఉన్నాయని, సాధ్యమైనన్ని ఎత్తిపోతల పథకాల ద్వారా ఆయా సాగు భూములకు నీటిని అందించాల్సి ఉందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ అసమర్థపాలనలో విద్యుత్‌రంగం సంక్షోభంలో కూరుకు పోయిందని, సుమారు రూ.48వేల కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేసిన విద్యుత్ రంగ శ్వేతపత్రాన్ని పరిశీలిస్తే ప్రజలకు కళ్ళు చెదిరే నిజాలు తెలుస్తున్నాయని అన్నారు. గాడి తప్పిన వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషిచేస్తున్నారని, ఆయనకు ప్రజలందరూ సహకరించాల్సిన అవసరం ఉందని భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు.





కలెక్టర్ అరుణబాబు, ఎస్పీ మాలికగార్గ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొమ్మాలపాటి

పల్నాడును అగ్రగామిగా నిలబెట్టాలి

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్
- కలెక్టర్, ఎస్పీలను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు

నరసరావుపేట టౌన్, జూలై 11 : పల్నాడు అన్ని రంగాలలో అగ్రగామిగా నిలబెట్టాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీదర్ కోరారు. గురువారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పీ అరుణబాబును మర్యాదపూర్వకంగా కలిసి శుభకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని సూచించారు. కాగా అనంతరం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మలిక గార్గ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ పల్నాడులో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు అసాంఘీక శక్తులను ఉక్కుపాదంతో అణిచివేయాలని ఎస్పీకి సూచించారు. జిల్లాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై కొమ్మాలపాటి వారితో చర్చించారు.



రోబోతో వీసీ నాగభూషణ్, విద్యార్థులు

రోబోటిక్స్ రంగంలో విప్లవాత్మక మార్పులు

- రోబోకప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ప్రవీణ్ మల్లా

గుంటూరు(విద్య), జూలై 11:భవిష్యత్తులో రోబోటిక్స్ రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని రోబోకప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ప్రవీణ్ మల్లా తెలిపారు. చేబ్రోలు మండలం పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకాని కల్ ఇంజనీరింగ్ (రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్) విభాగంలో 'రోబోకప్లర్స్ సెమి అండ్ హ్యూమనాయిడ్ రోబోట్ మ్యానుఫాక్చరింగ్ హబ్‌ను గురువారం ఘనంగా ప్రారం భించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రవీణ్ మల్లా మాట్లా డుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీ అడ్వాన్స్డ్ రోబోటిక్స్ లేబొరేటరీతో మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈహబ్ వలన విద్యార్థులతో పాటు పరిశోధనా అధ్యాపకులు రోబోట్‌లను రూపొందించడం, వాటిని అభివృద్ధి చేయడం మాత్రమే కాకుండా వాటి వాణిజ్యీకరణ కోసం మార్కెట్‌లోకి తీసుకెళ్లే అద్భుతమైన అవకాశం వస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

27,246 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 26,349 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 27,246 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 16,946 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16500	334	11000	15000
నెంబరు. 5	9000	15000	నెంబరు. 5	–	–
273	9500	11000	273	–	–
341	9000	17500	341	10000	15500
4884	12800	12800	4884	12000	14500
సూపర్ 10	15500	15500	సూపర్ 10	13200	13200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18500	తేజ	10000	18000
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	9500	14000
దేవనూరు డీలక్స్	9000	13500	దేవనూరు డీలక్స్	8800	15000
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	5000	10000



ఉద్యోగావకాశాలు

- మంగళగిరి పరిసర ప్రాంతాలలో ప్రముఖ పురుగు మందు కంపెనీలో పని చేయుటకు యువకులు కావలెను. Q: డిగ్రీ, జీతం : 15000, TA+DA_3000, (టూ వీలర్ కావలెను). సంప్ర: 81850 46367. AJG-191612
- ప్రభావతి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ & మెడికల్ షాపు నందు పనిచేయుటకు నర్సింగ్ స్టాఫ్ కావలెను. హస్టల్ సదుపాయం మరియు ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర. 98492 30580, అడ్రస్ : 1/4, రామన్నపేట, కొరిటెపాడు, గుంటూరు RK-1252
- Hindi Subject Teacher Wanted from 6th to 10th Classes Hindi Subject Teaching. Free Boarding and Lodging. Contact immediately, Sri Raghavendra High School, Kurichedu, Cell: 9490327336 AJO-190347
- WANTED WORKERS AND SUPERVISERS (Super markets, Hotels, Restaurents, Factories, Construction Companys) ✆ 91210 57233. AJB-423
- మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000. సంప్ర: 9550745296. AJV-192984

వధువు కావలెను

- కుల పట్టింపు లేదు / 35 సం. / ఏకైక కుమారుడు / MBA/ ప్రైవేట్ ఉద్యోగం / ఎత్తు 5.5 / తల్లిదండ్రులు లేరు. ఏ బాదరబందీలేని అందమైన అబ్బాయికి 1వ & 2వ వధువు కావలెను. Cont.:7899598848 AJH-001974

CHANGE OF NAME

I, Pasumarthi Bhaskar Rao (ESM No.13622282F), Born on 25/04/1974, R/o D.No.1-34/1, Mandevaripalem, Pittalavanipalem, Bapatla-522314, changed Name Vide AP Gazette No.250 Issue No.530 dt.04 Jul 2024, shall henceforth be known as PASUMARTHI BHASKARA RAO S/o PASUMARTHI PRASADA RAO AJH-14560

స్థలం అమ్మకము

ఇన్నర్ రింగ్ రోడ్

- రెడ్డిపాలెం, శాంతి అర్చ్ ప్రక్క రోడ్డున ఆంజనేయులు కాలనీ, సిమెంట్ రోడ్డు నందు 252 చ॥గజాల దక్షిణము ఫేస్ ఖాళీ స్థలము అమ్మకమునకు కలదు. ఫోన్: 8297941638. AJG-184776

పోయినవి

- I, VALE SRIKANTH S/o. VALE CHINA KOTESWARA RAO, R/o. Flat No.102, Machiraju Residency, LI C Colony 2nd Lane, Stambalagaruvu, Guntur, Andhra Pradesh. I have Obtained Passport with No: L4081488, Issued by Passport Officer, HYDERABAD, Issued on 01-08-2013, Expiry Date : 31-07-2023. The said passport was lost, while I was travelling at Pattabhipuram, Guntur for Xerox Copies. I tried to trace but in vain. AJG-191486

మీ సర్టిఫికెట్స్ పోయినవా ?

- మీరు పోగొట్టుకున్నా / కాలిన / చిరిగిన 10, ఇంటర్, డిగ్రీ మొ॥ సర్టిఫికెట్స్ తెప్పించబడును. సర్టిఫికెట్స్ కరెక్షన్ & పేరు మార్పిడికి గైడెన్స్, స్టూడెంట్ సర్వీస్ సెంటర్, గుంటూరు. సెల్ : 98491 85616. AJG-191534

EDUCATION

- AP State Scholarship Eligible Students pay small admission fee and Join B.Sc Com Sciences - learn Python, B.Sc Electronics - Learn CMOS VLSI, B.Com Comp App - Learn Tally, BA Economics / History / Special English - Learn MS Office, PLNM (Prabhala) Degree College, Opp. Acharya Nagarjuna University Mens Hostel, Cont: 91774 08565. AJG-191481

పాఠకులకు ముఖ్య గమనిక


క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు **99854 03281**

సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు, మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	99854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ళ	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	99639 84109
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	91103 23914
ప్రత్తిపాడు	63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

గుంటూరు	నాజ్ థియేటర్
గుంటూరు	హరిహరమహల్
గుంటూరు	గౌరీ శంకర్
గుంటూరు	శివ థియేటర్
గుంటూరు	సినీ స్క్వేర్
గుంటూరు	సినీ ఫ్రైమ్
గుంటూరు	వి.ప్లాటినో
గుంటూరు	ఫోనిక్స్ మాల్ (మైత్రీ)
గుంటూరు	ది సినిమాస్
గుంటూరు	జెఎల్ఇ సినిమాస్
ఒంగోలు	గోరంట్ల సినిమాస్
ఒంగోలు	రవి ప్రియమాల్
ఒంగోలు	సత్యం థియేటర్
తెనాలి	సంగమేశ్వర
తెనాలి	పెమ్మసాని
నరసరావుపేట	లక్ష్మి నరసింహ
నరసరావుపేట	ఈశ్వరమహల్
చిలకలూరిపేట	సాయి కార్తీక
చీరాల	సురేష్‌మహల్
బాపట్ల	శ్రీనివాసమహల్
పిడుగురాళ్ళ	గంగామహల్
పొన్నూరు	శ్రీలక్ష్మీ
మంగళగిరి	ఊర్వశి
మంగళగిరి	వెంకటేశ్వర
రేపల్లె	రాజ్యలక్ష్మి
మాచర్ల	వెంకటేశ్వర
సత్తెనపల్లి	సాయికృష్ణ
వినుకొండ	కీర్తి డీలక్స్
అద్దంకి	వి.ఎన్.ఎస్
టంగుటూరు	అప్సర
చీమకుర్తి	కె3కె సినిమాస్



బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



నిరుపయోగంగా ఉన్న రైతుబజారును పరిశీలిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళీ, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

రైతుబజారు పునఃప్రారంభానికి చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, జూలై 11 : రైతుబజారును పునఃప్రారంభించి రైతులు పండించిన ఉత్పత్తులు అమ్ముకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కలెక్టర్ జె.వెంకటమురళీని కోరారు. 2019వ సంవత్సరంలో బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులు రూ.60 లక్షలు వెచ్చించి అప్పటి ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ రైతుబజారు నిర్మించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని నిర్లక్ష్యం చేసి మూసివేసింది. ఫలితంగా రైతుబజారులోని షాపులు దెబ్బతిని వాటర్‌ప్లాంట్ పనికిరాకుండా పోయిందంటూ ఇటీవల ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై స్పందించారు. కలెక్టర్ జె.వెంకటమురళీతో కలిసి గురువారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రైతుబజారును పరిశీలించారు. రైతుబజారు లేకపోవటం వల్ల సన్న, చిన్నకారు రైతులు రోడ్లమీదే తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నారని దీనిపై వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని పలువురు తెలిపారు. వెంటనే దీనిని పునఃప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి ఈబి విలియమ్స్, ఆర్డీవో గంధం రవీందర్, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ నక్కా మోహనరావు, టీడీపీ నాయకులు అల్లం గోపికృష్ణ, ఎం.శేషుకృష్ణ, కుర్రా ధనేంద్ర ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఫొటోగ్రాఫర్స్ యూనియన్ భవనం కోరుతూ వినతి

బాపట్ల, జూలై 11 : ప్రగతి ది బాపట్ల ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు కార్యాలయ భవనం నిర్మించాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎన్నికలకు ముందు 10 సెంట్ల స్థలం ఇచ్చి కార్యాలయం నిర్మిస్తామని నరేంద్రవర్మ ఇచ్చిన హామీని నాయకులు గుర్తు చేశారు. నాలుగు నెలల్లో సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సుధాకర్, కార్యదర్శి బీఎం జయరావు, కోశాధికారి ఎస్.ఏడుకొండలు, ఎం.మల్లేశ్వరరావు, కె.వెంకట్రావు, కృష్ణ, శ్రీను, కోటిపల్లి మురళీ, ఎం.రవణ, పి.నాగేశ్వరరావు, ఎం.భీమసేన్ తదితరులు ఉన్నారు.

జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలి

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్

బాపట్ల, జూలై 11 : జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ కోరారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ముఖ్యుల సమావేశం గురువారం జరిగింది. సమావేశానికి ప్రసన్నకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మండలానికి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేయటానికి గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో అభివృద్ధికి నిధులు కేటాయించి గత సంవత్సరం విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మోటిక్ ఛార్జీలను విడుదల చేయాలన్నారు. విద్యారంగంగా అభివృద్ధి చెందుతున్న బాపట్ల జిల్లాలో ప్రధాన పట్టణాలైన బాపట్ల, చీరాలలో డిగ్రీ చదువుకునేందుకు కోఎడ్యుకేషన్ ప్రభుత్వ కళాశాలలు లేకపోవటం వల్ల ఈ ప్రాంతంలో విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలకు వెళ్ళి చదువుకుంటున్నారన్నారు. అదేవిధంగా పీజీ కోర్సులు చదువుకునేందుకు ఇతర ప్రాంతాలు వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా కేంద్రంలో పీజీసెంటర్ ఏర్పాటు కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు శివశంకర్, ఉపాధ్యక్షులు మనోజ్‌కుమార్, జిల్లాకమిటీ సభ్యులు హేమ, నాగశ్రీ, ప్రేమచంద్, నితిన్, సందీప్, నవీన్, అహ్మద్ పాల్గొన్నారు.

మాతృశ్రీ ఓరియంటల్ కళాశాలలో న్యాక్ బృందం పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న న్యాక్ బృందం సభ్యులు

బాపట్ల ,జూలై 11 : జిల్లెళ్ళమూడి మాతృశ్రీ ఓరియంటల్ కళాశాలను గురువారం నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ బృందం రెండు రోజులు పాటు కళాశాల పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. బెంగుళూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ కొలకలూరి ఆశాజ్యోతి, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడు ప్రొఫెసర్ పి.వేల్మురుగన్, డాక్టర్ మహేష్ మెహత బృందం వారు కళాశాలలోని హాస్టల్ వసతులు, బోధన పద్ధతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ ఆశాజ్యోతి మాట్లాడుతూ మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల అభివృద్ధి సాధించేందుకు శక్తివంతమైన మేనేజ్‌మెంట్ ద్వారా అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. విద్యార్థులు సాంప్రదాయకమైన ఓరియంటల్ విద్య ద్వారా భాష నైపుణ్యాన్ని పెంచుకొని కళాశాల కల్పిస్తున్న విశేషమైన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కండెక్టర్‌పై పలువురు మూకుమ్మడిగా దాడి



కండెక్టర్ రమణయ్యను పరామర్శిస్తున్న పొన్నూరు ఆర్టీసీ డీఎం అజీత్‌కుమారి

పిట్టలవానిపాలెం, జూలై 11 : ఓ మహిళ ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తూ ముగ్గురు కూర్చొనే ప్రయాణికుల సీటులో కాలుమీద కాలువేసుకొని ప్రయాణికులు కూర్చొనే అవకాశం లేకుండా ఆమె వ్యవహరించిన తీరును గమనించిన కండెక్టర్ జివి.రమణయ్య సర్దుకొని కూర్చోవాలని అనటంతో గొడవకు దిగిన ఆమె గ్రామానికి చెందిన సుమారు 10 మందిని పిలిపించుకొని కండెక్టర్‌పై దాడికి పాల్పడిన సంఘటన ఇది. వివరాల్లోకి వెళితే... పిట్టలవానిపాలెం మండలం చందోలు పెట్రోల్ బంకు కూడలిలో చెరుకుపల్లి మండలం కుంచలవారిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తులు అక్కడకు విచ్చేసి బస్సులో ఉన్న కండెక్టర్‌ను కిందకు లాగి ముక్మడిగా దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డారు. అదేవిధంగా రేపల్లె డిపోకు చెందిన బస్సు అద్దాలు పగలగొట్టి అడ్డువచ్చిన వారిని భయభ్రాంతులకు గురిచేశారు. తీవ్రంగా గాయాలైన కండెక్టర్‌ను చందోలు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రానికి తరలించి చికిత్స అందజేసి మెరుగైన వైద్యం కోసం బాపట్ల ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించినట్లు చందోలు ఎస్సై టి.అనీల్‌కుమార్ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పొన్నూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అజీత్‌కుమారి వైద్యశాలకు వెళ్ళి గాయపడిన కండెక్టర్‌ను పరామర్శించి జరిగిన సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చందోలు పోలీసు స్టేషన్‌కు వెళ్ళి దాడి ఘటనపై ఎస్సైను సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ విషయమై చందోలు ఎస్సై టి.అనీల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రేపల్లె బ్రాంచ్ వారి సూచనలు పొంది యావన్మందికి తెలియచేయునది ఏమనగా... **దేవగిరి పాములు** గారి కుమారుడు **దేవగిరి ఉమా మహేష్** గారు ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లెయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియ చేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లెయిములు రానిచో మా క్లయింట్ సదరు **దేవగిరి ఉమా మహేష్** గారికి ఋణం మంజూరు చేయును. **షెడ్యూలు : 3వ అయిటం:** గుంటూరు డి, తెనాలి ఆర్.డి, రేపల్లె సబ్.డి., యిలాకా రేపల్లె మండలం, కారుమూరు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరినటువంటి కారుమూరు గ్రామ డోర్ నెం. 1-23కు సమీపమున గల కారుమూరు గ్రామ సర్వే నెం. 82/2B3లో య. 1-48ట్లున్నా, టిటో గ్రామ సర్వే నెం. 82/3లో య. 0-35ట్లున్నా, టిటో గ్రామ సర్వే నెం. 82/4లో య. 1-36ట్లున్నా, టిటో గ్రామ సర్వే నెం. 165లో య. 1-11ట్లున్నా, టిటో గ్రామ సర్వే నెం. 166లో య. 4-20ట్లున్నా, వెరసి అన్ని నెంబర్లు తాలూకు ఏకఖండముగా వున్న య. 8-50ట్లులో లేఅవుట్ పొందిన రీత్యా డి.టి.పి.ఎల్.పి.నెం. 21/2018/జి సుగా మంజూరు చేసిన లేఅవుట్ రీత్యా మావే ఏర్పాటు చేయబడిన ప్లాట్లలో ప్లాటు నెం.30కు తాలూకు చ.గ. 200లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు **తూర్పు :** 33 అడుగుల వెడల్పు గల రోడ్డు హద్దు 36 అడుగులు, **దక్షిణం :** ప్లాటు నెం. 31కు తాలూకు స్థలము హద్దు 50 అడుగులు, **పడమర :** ప్లాటు నెం. 4కు తాలూకు స్థలము హద్దు 36 అడుగులు, **ఉత్తరం :** ప్లాటు నెం. 29కు తాలూకు స్థలము హద్దు 50 అడుగులు, ఈ హద్దుల మధ్య చ.గ. 200లున్నా. **4వ అయిటం:** టిటో ప్లాట్లలో ప్లాటు నెం.31కు తాలూకు చ.గ. 200లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు **తూర్పు :** 33 అడుగుల వెడల్పు గల రోడ్డు హద్దు 36 అడుగులు, **దక్షిణం :** ప్లాటు నెం. 32కు తాలూకు స్థలము హద్దు 50 అడుగులు, **పడమర :** ప్లాటు నెం. 3కు తాలూకు స్థలము హద్దు 36 అడుగులు, **ఉత్తరం :** ప్లాటు నెం.30కు తాలూకు స్థలము హద్దు 50 అడుగులు, ఈ హద్దుల మధ్య చ.గ. 200లున్నా. పైన తెలిపిన 4 అయిటముల మొత్తము చ.గ. 862.57లకు సరియగు చ.మీ. 724.55ట్లు ఖాళీ నివేశన స్థలము మాత్రం. **DOC NO: 5452/2019, S.R.O. రేపల్లె**

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు,
2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.

జనాభా పెరుగుదల అదుపునకు సహకరించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటమురళీ, ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితరులు

బాపట్ల, జూలై 11 : జనాభా పెరుగుదలను అదుపు చేయటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ జె.వెంకటమురళీ కోరారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏరియావైద్యశాల దగ్గర నుంచి నిర్వహించిన ఈ ర్యాలీని కలెక్టర్ జె.వెంకటమురళీ, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. వారితో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనాభా పెరుగుదలలో భారతదేశం అగ్రభాగాన నిలిచిందన్నారు. మనదేశ జనాభా 138కోట్లకు చేరటంతో అందుకు సరిపడ వనరులు దేశంలో పెరగలేదన్నారు. యువశక్తి అత్యధికంగా ఉన్నదేశాల జాబితాలో భారత్ మొదటి స్థాయిలో నిలిచిందన్నారు. జనాభా పెరిగినంతగా జలవనరులు, భూమి, ఆహార ధాన్యాలు, ఇతర వనరులు పెరగలేదన్నారు. ఈ క్రమంలో ఉద్యోగాలు, ఆహార ధాన్యాలు ప్రజలకు సమృద్ధిగా లేక ఆర్థిక సమస్యలు ఉత్పన్నమౌతున్నాయన్నారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే ఒకరు ఇద్దరు పిల్లలతోనే సాధ్యమన్నారు.

ధరిత్రిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. నేలతల్లి, పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజల జీవనం, పిల్లలను కనటంతో మార్పురావాలని కోరారు. ఒకబిడ్డ ముద్దు-ఇద్దరు వద్దు అనే నినాదంతో ప్రజలు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డీసీహెచ్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శేషుబాబు, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రవణ్, ఆర్డీవో రవీందర్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు, టీడీపీ నాయకులు అల్లం గోపికృష్ణ, ఎం.శేషుకృష్ణ, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, పేరలి సునీల్, గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్వాపార్క్ ఏర్పాటుతో అన్ని రంగాలు అభివృద్ధి

ఆక్వాపార్కు ఏర్పాటుతో జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ జె.వెంకటమురళీ తెలిపారు. మత్స్యశాఖాధికారులతో స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ సమావేశమయ్యారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆక్వాపార్కు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిలిస్తూ నిధులు మంజూరు చేసిందని కలెక్టర్ తెలిపారు. సమీకృత ఆక్వా సాగు చేయడానికి కేంద్రం పిపి (ప్రైవేట్ పార్టనర్‌షిప్) పద్ధతిలో నిర్మించడమే లక్ష్యమన్నారు. సముద్రం నుంచి ఏర్పడిన భూభాగానికి సర్వేనెంబరు కేటాయిస్తూ అధికారిక అనుమతులపై 571జీవోను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. సదరు భూమి కేటాయింపులకు సిపిఎల్ నుంచి అనుమతులు ఈనెలలో వస్తాయన్నారు. రూ. 189 కోట్ల వ్యయంతో చేపట్టే ప్రాజెక్టుకు ఇప్పటికే రూ. 84 కోట్ల నిధులు విడుదలై సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్ ప్రారంభానికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించటం జరిగిందన్నారు. ఆక్వా ప్రాజెక్ట్‌తో 5 రకాల సెక్టార్లు నిజాంపట్నం ప్రాంతంలో అభివృద్ధిలోకి రానున్నాయని కలెక్టర్ వెంకటమురళీ చెప్పారు. వివిధ రకాల జాతుల మత్స్య సంపద ఉత్పత్తుల ఎగుమతులకు కేంద్రంగా ఆక్వా పార్కు అభివృద్ధిచెందుతుందని వివరించారు. వీటితోపాటు ఆక్వా టూరిజం అభివృద్ధిలోకి రానుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ వి.సుబ్బారావు, మత్స్యశాఖ ఏడీపీ.సురేష్, ఆర్డీవో హేబా షారోన్, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పక్కాగా అమలు చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కొరకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్నభోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ వెంకట మురళీ సంబంధితాధికారులను ఆదేశించారు. మధ్యాహ్నభోజన పథకంపై సంబంధిత విద్యాశాఖ, సమగ్రశిక్షణ అభియాన్ అధికారులతో కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్నభోజన పథకంపై అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు, సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీ ఎం.వెంకటసుధాకర్‌బాబు విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న బాపట్ల మోటారు వాహనాల తనిఖీ అధికారి ప్రసన్నకుమారి, ట్రాఫిక్ ఎస్సై సుధాకర్ తదితరులు

రోడ్డు భద్రత అందరి బాధ్యత

● మోటారు వాహనాల తనిఖీ అధికారిణి ప్రసన్నకుమారి

బాపట్ల, జూలై 11 : రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని బాపట్ల మోటారు వాహనాల తనిఖీ అధికారి ప్రసన్నకుమారి తెలిపారు. జిల్లా రవాణాశాఖాధికారి సురేష్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు గురువారం చీలురోడ్డు సెంటర్‌లో వాహన చోదకులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలన్నారు. జిల్లాలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై సుధాకర్, సిబ్బంది విక్టర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ వేడుకలు

బాపట్ల, జూలై 11 : బాపట్ల న్యూ బస్టాండ్ గ్యారేజీలో ఎంప్లాయిస్ యూనియన్ 73వ యూనియన్ ఆవిర్భావ వేడుకలు గురువారం యూనియన్ నాయకులు ఘనంగా నిర్వహించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ 72 సంవత్సరాల నుంచి ఒక ప్రక్క సంస్థ అభివృద్ధికి, ఇంకొక ప్రక్క కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు సమాఖ్య ఉద్యమాలు నిర్మించి కార్మిక ప్రయోజనాలు కాపాడిందని తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు వీఆర్ ప్రసాద్, యూనియన్ నాయకులు ఎంప్లాయిస్ యూనియన్ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రాజేశ్వరరావు, సీనియర్ మహిళా కండెక్టర్ జీఎస్.కుమారి, సీనియర్ నాయకుడు వీఎల్ నారాయణ, రాష్ట్ర నాయకుడు బీటి వలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి

కర్లపాలెం, జూలై 11 : ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలను, కిట్లను విద్యార్థులు సక్రమంగా ఉపయోగించుకొని క్రమశిక్షణతో రాణించాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని పేరలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గురువారం నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు కిట్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మను, డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తిలను పాఠశాల ఉపాధ్యాయ బృందం దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి, వై.భూపతిరావు, ఎం.బుల్లియ్య, నామన శివన్నారాయణ, గొట్టిపాటి శ్రీకృష్ణ, చిలకల సురేంద్రబాబు, మద్దిబోయన బుల్లియ్య, గేరా ఏసుబాబు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, జనసేన, బీజేపీ,టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు బుక్స్, కిట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

ఉత్తమ ఆరోగ్య సహాయకుడిగా బ్రహ్మకిషోర్

కర్లపాలెం, జూలై 11 : కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సహాయకుడిగా పనిచేస్తున్న ఎస్.బ్రహ్మకిషోర్ ఉత్తమ సేవలందించారని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వై.విజయమ్మ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సహాయకులుగా పని చేస్తున్న బ్రహ్మ కిషోర్‌కు వైద్యాధికారి విజయమ్మ గురువారం ఉత్తమ ఉద్యోగి ప్రశంసపత్రాన్ని అందజేశారు. బ్రహ్మకిషోర్‌ను విజయమ్మ ప్రత్యేకంగా అభినందించారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో

పిట్టలవానిపాలెం, జూలై 11 : మండలంలోని చందోలు మెయిన్ రోడ్డు ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు సందర్శించి పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో-1 మాట్లాడుతూ సమయపాలన పాటించి విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందజేయాలని మధ్యాహ్నం భోజనం నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.గీతారత్నకుమారి, సీఆర్పీ ఎం.ముసలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

16న మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం

పిట్టలవానిపాలెం, జూలై 11 : పిట్టలవానిపాలెం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 16న మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో బీవీ రమణమూర్తి తెలిపారు. సమావేశం ఇన్‌చార్జి ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు అధ్యక్షతన జరుగుతుందని, అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని తెలియజేశారు.

పసుపు రైతాంగానికి అండగా నిలిచిన కూటమి ప్రభుత్వం

భట్టిప్రోలు, జులై 11 : కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంలో పసుపును కోల్పోయిన రైతాంగానికి కూటమి ప్రభుత్వం అండగా నిలవడం అభినందనీయమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి వేములపల్లి వెంకటరామయ్య అన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంలో పసుపును కోల్పోయి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడంలో యజమాని, వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందారన్నారు. రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుల దృష్టికి తీసుకువెళ్ళగా సానుకూలంగా స్పందించి సదరు విషయంపై సీఎం చంద్రబాబునాయుడుతో చర్చించారన్నారు. జరిగిన నష్టాన్ని పూర్తి స్థాయిలో భర్తీ చేయలేకపోయినప్పటికీ క్వింటాకు రూ.7,000లు చొప్పున నష్టపరిహారం అందించే విధంగా హామీనివ్వడం జరిగిందని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వానికి రైతు సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.రామస్వామి, ఎం.సత్యానారాయణ, బి.సుబ్బారావు, జి.నాగరాజు, రైతులు నాదెండ్ల సురేంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘తల్లి కోసం ఓ చెట్టు నాటడం కార్యక్రమం’

కొల్లూరు, జూలై 11 : తల్లి కోసం ఓ చెట్టు నాటడం కార్యక్రమాన్ని ఐసీడీఎస్ అధికారులు నిర్వహించారు. గురువారం అమృతలూరు ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి మండల పరిధిలోని క్రాప గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ, ప్రతి తల్లి తమ ఇంటి ఆవరణలో ఓ మొక్కను నాటుకోవాలని దీని వల్ల పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న ఆయాలు తమ స్థానంలో బయట వ్యక్తిని నియమించుకుని పనులు చేయిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, ఏ కేంద్రానికి కేటాయించిన ఆయా ఆ కేంద్రంలోనే విధులు నిర్వహించాలని, వారి స్థానంలో మరొకరు విధులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కొల్లూరులోని 1, 14 నెంబర్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి కేంద్రంలో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో విజయరాణి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సత్తా చాటిన పెసర్లంక విద్యార్థులు

భట్టిప్రోలు, జులై 11 : ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో మండలంలోని పెసర్లంక జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు సత్తా చాటినట్లు హెచ్ఎం మహబూబ్ బాషా తెలిపారు. గురువారం ప్రకటించిన ట్రిపుల్ ఫలితాల్లో తమ పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థులు కంచర్ల రాహుల్-నూజివీడు, గొరిగపూడి కీర్తన - ఒంగోలు, తెనాలి స్టీవెన్‌పాల్ - ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికయ్యారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు పది ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమేగాక ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. సీట్లు దక్కించుకున్న విద్యార్థులను ఎంఈవోలు పి.లాజరు, ఎస్.దేవరాజ్ అభినందించారు.

కార్మికుల హక్కుల కోసం కృషి చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్

రేపల్లె, జూలై 11 : కార్మికుల హక్కుల పరిరక్షణలో నిరంతరం పోరాటాలు చేస్తూ వారికి అండగా నిలిచింది ఎంప్లాయిస్ యూనియన్ అని ఎంప్లాయిస్ యూనియన్ డిపో సెక్రటరీ కమలాకరరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చటంలో ఆర్టీసీ కార్మికులు ఎనలేని సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కె.బ్రహ్మయ్య, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

డిగ్రీ మొదటి సంవత్సరం ఆన్‌లైన్ అప్లికేషన్ గడువు పెంపు

రేపల్లె, జూలై 11 : 2024-25 విద్యా సంవత్సరంలో ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదవబోయే విద్యార్థులకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవటానికి గడువు ఈనెల 25వ తేదీ వరకు పొడిగించటం జరిగిందని ప్రిన్సిపాల్ టి.రవిచంద్రకుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్యాస్ లీకై తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు మృతి



కృష్ణకుమారి(ఫైల్)

కొల్లూరు, జూలై 11 : గ్యాస్ లీకై ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొల్లూరు కైలాసపురంలోని అద్దె ఇంటిలో నివసిస్తున్న తలశిల కృష్ణకుమారి గురువారం ఉదయం టీ కాచుకునేందుకు స్టౌవ్ వెలిగించగా గ్యాస్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి చీరకు, పక్కనే ఉన్న కర్టెన్లకు అంటుకోవడంతో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్ తీసుకువెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించడంతో అక్కడి నుంచి జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం 4 గంటల సమయంలో మృతి చెందింది. గ్యాస్ లీకేజీ సమాచారం తెలుసుకున్న గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం, ప్రతినిధులు సంఘటనా స్థలానికి పంపి ప్రమాద వివరాలను సేకరించారు.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292

పట్టణవాసులకు సమృద్ధిగా తాగునీరు అందిస్తాం



సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వాటర్ ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న శివప్రసాద్, కమిషనర్

రేపల్లె, జూలై 11 : పట్టణ వాసులకు సమృద్ధిగా తాగునీరు అందించేందుకు కృషి చేస్తామని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. అరవపల్లి రోడ్డులోని సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ వాటర్‌ఫిల్టర్ బెడ్ మోటార్లను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీరు పూర్తిస్థాయిలో ప్రజలకు అందించలేదని, సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌లో మెయిన్ కెనాల్ నుంచి తాగునీటిని పంపింగ్ చేసి ఫిల్టర్ బెడ్‌ల ద్వారా నీటిని శుద్ధి చేసి ప్రజలకు అందిస్తామని తెలిపారు. మోటార్ల పనితీరు, పంపింగ్ హౌస్‌లో నెలకొన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణ వాసులకు నీటి కొరత లేకుండా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మెయిన్ కెనాల్‌కు నీరు విడుదల చేశారని, కాల్వలోకి నీరు రావటంతో స్టోరేజ్ ట్యాంక్‌లోకి మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేసి పట్టణవాసులకు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి, ఆర్ఐ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన నిలబడే ప్రభుత్వంగా కూటమి పాలన

● టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు



సబ్సిడీ బియ్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విజయబాబు

వేమూరు, జూలై 11 : రాష్ట్రంలో పేదల పక్షాన నిలబడే ప్రభుత్వంగా కూటమి పాలన సాగుతుందని బాపట్ల పార్లమెంటరీ స్థాయి తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అన్నారు. వేమూరులో గురువారం సబ్సిడీ ధరలపై బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటడం వల్ల పేదలతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఆర్థిక పరంగా ఇబ్బందులను ఎదుర్కొన్నారని విమర్శించారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి కిలో కందిపప్పు రూ.160కు, బియ్యాన్ని రూ.48కు, స్టీమ్డ్ బియ్యాన్ని రూ.49కే అందించాలన్న నిర్ణయం తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు ఊస రాజేష్, డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు మొవ్వ వేణుగోపాల్, తాడికొండ సత్యపూర్ణప్రసాద్, పౌరసరఫరాల శాఖ అధికారులు, టీడీపీ నాయకులు కోగంటి శ్రీనుబాబు, ఎలవర్తి సురేంద్ర, గోపినాధ్, అనే ప్రసాద్, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి

● విద్యుత్ శాఖ ఈఈ చిరంజీవి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఈఈ చిరంజీవి

వేమూరు, జూలై 11 : గ్రామాల్లో నిరంతరం విద్యుత్ సరఫరాకు ప్రణాళికా బద్ధంగా కృషి చేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ వీవీ చిరంజీవి అన్నారు. విద్యుత్ మీటర్ల తనిఖీల్లో భాగంగా గురువారం మండలంలోని 17 గ్రామాల్లో ఈ పర్యవేక్షణలో 130 మంది సిబ్బంది 5709 సర్వీస్‌లను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక లక్ష్మీ గణపతి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఏఈ గోపి అధ్యక్షత వహించారు. ఈఈ చిరంజీవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు విద్యుత్‌శాఖలో మార్పులు తీసుకురావడం జరుగుతుందన్నారు. నిరంతర సరఫరా అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వ్యవసాయ మోటార్లకు సంబంధించి ప్రత్యేక ఫీడర్లను ఏర్పాటు చేయడంలో వోల్టేజి సమస్యను పరిష్కరించేందుకు ఎక్కడికక్కడ ట్రాన్స్‌ఫార్మర్లను నెలకొల్పటం జరుగుతోందన్నారు. మండలంలో జరిగిన తనిఖీలలో 177 మంది వినియోగదారులు అధిక లోడుతో విద్యుత్‌ను వాడుతున్నారని, వారి నుంచి రూ.7.928 లక్షలు పెనాల్టీ వసూలు చేయాలని ఆదేశించామన్నారు. మరో ఇద్దరు అక్రమంగా విద్యుత్తును వినియోగిస్తున్నారని వారి నుంచి రూ.80 వేలు వసూలు చేసేందుకు సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు ఈఈడిపిఈకేవిఎల్ఎస్ మూర్తి, డీఈఈ కే.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల అక్రమాలపై విచారణ



ఉపాధి హామీ పనుల అక్రమాలపై విచారణ జరుపుతున్న ఏపీడీవో సువార్త

అమృతలూరు, జూలై 11 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలు, అక్రమాలపై ఏపీడీవో సువార్త గురువారం విచారణ జరిపారు. మండల పరిధిలోని వామనగుంటపాలెం పరిధిలో ఫీల్డ్ అసిస్టెంట్ గర్నెపూడి క్రాంతికుమార్ గత మూడు సంవత్సరాలు గా జరిగిన పనుల్లో అవినీతికి, అక్రమాలకు పాల్పడినట్లు కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు సురేష్‌బాబు ఫిర్యాదు చేశాడు. ఫీల్డ్ అసిస్టెంట్ నగదు దుర్వినియోగానికి పాల్పడటంపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏపీడీవో విచారణ చేశారు. విచారణ అనంతరం ఏపీడీవో మాట్లాడుతూ వచ్చిన అభియో గాలపై ఆయా కూలీల వద్ద నుంచి లిఖితపూర్వక సమాధానం తీసుకోవడం జరిగిందన్నారు. ఉద్యోగం చేసుకుంటున్న ఇద్దరిని కూలీలుగా నమోదు చేయడం జరిగినట్లు గుర్తించామన్నారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఆమె వెంట బాపట్ల క్లస్టర్ టిపి శ్యాంబాబు, మోపర్రు పంచాయతీ కార్యదర్శి శివలీల తదితరులు ఉన్నారు.

అద్దేపల్లి శ్మశానవాటికకు మెరకలు వేయించిన టీడీపీ నాయకులు

భట్టిప్రోలు, జూలై 11 : భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి హిందూ శ్మశాన వాటిక లోతట్టుగా ఉండి ఇబ్బందికరంగా మారింది. శ్మశానవాటికలో కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు స్థానిక తిరువీధులవారి చెరువు నుంచి మట్టిని తరలించి గురువారం హిందూ శ్మశాన వాటికలో మెరకలు వేయించారు. అద్దేపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ నాయకులు బట్టు మల్లికార్జునరావు, నాయకులు కనపర్తి సుందరరావు, కుందేటి శివన్నారాయణ, తిరువీధుల ఆంజనేయులు, గ్రామస్తులు గొరిపర్తి బోసు, కుందేటి రామకృష్ణ, శ్రీను, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



అద్దేపల్లి హిందూ శ్మశాన వాటికలో మెరకలు వేయిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీ పెద్దింటమ్మ అమ్మవారికి సారె సమర్పణ

కర్లపాలెం, జూలై 11 : కర్లపాలెం శ్రీపెద్దింటమ్మ అమ్మవారికి గణపవరం గ్రామమహిళలు గురువారం సారె సమర్పించారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఆటను ఆడారు. అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు.





పర్చూరులో అడుగంటిన మంచినీటి చెరువు.. చెరుకూరులోని తామర, నాచుతో ఇలా .. రంగుమారి కంపుకొడుతున్న కొల్లావారిపాలెం చెరువు

దాహం..దాహం..!

- ఉన్నది అరకొరే ... ఆపై కలుషితం
- గుక్కెడు మంచినీటి కోసం ఎదురు చూపులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

పర్చూరు, జూలై 11 : గుక్కెడు మంచినీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. పర్చూరులో దాహం కేకలు విన్పిస్తున్నాయి. మండలంలో ఎక్కడ చూసినా అడుగంటిన మంచినీటి చెరువులే దర్శన మిస్తున్నాయి. ఉన్న అరకొర నీరు కాస్త రంగుమారి కంపుకొడుతున్నాయి. దీంతో గత్యంతరం లేక కలుషిత నీటి తోనే ప్రజల కాలం వెల్లబుచ్చుతున్నారు. కనీసం రంగుమారి, కంపుకొడుతున్న నీటిని శుద్ధి చేసి సరఫరా చేద్దామన్నా ఫిల్టర్‌బెడ్‌లు పనిచేయడం లేదు. దీంతో పంచాయతీ ట్యాప్‌ల ద్వారా సరఫరా అవుతున్న నీటితోనే ప్రజలు కాలం వెల్ల బుచ్చుతున్నారు. మరో పక్క మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు అనేక గ్రామాల్లో మంచినీటి చెరువుల పరిస్థితి దయనీయంగా మారింది. తామర, నాచు, చిల్లచెట్లతో చెరువులు కన్పిస్తున్నాయి. వైసీపీ పాలనలో మంచినీటి చెరువులను పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో మంచినీటికి కటకటలాడే పరిస్థితిలు నెలకున్నాయి. నాగుపాలెం, పర్చూరు, ఉప్పుటూరు, చెరుకూరు, దేవరపల్లి, కొల్లావారిపాలెం, పెద్దివారిపాలెం తదితర గ్రామాల్లో పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు స్వచ్ఛమైన మంచి నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలి.

అలంకారప్రాయంగా ఆర్వో ప్లాంట్‌లు తరచూ మరమ్మతులు

మంచి నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు సక్రమంగా పనిచేయడం లేదు. చెరువుల్లో రంగుమారి, కలుషితంగా మారడంతో ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు గురవుతూ అలంకారప్రాయంగా ఎన్పిస్తున్నాయి.రోటరీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ సైతం తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి.

ప్రైవేటు వ్యాపారుల నీటి దోపిడీ

ప్రస్తుతం మండలంలో మంచినీటి చెరువులు అడుగంటడం, ఆర్వోప్లాంట్‌లు మూలపడడంతో ప్రైవేటు వ్యాపారులకు నీటి పంట పండింది. 20లీటర్ల నీటి క్యాను రూ.25, రూ.30అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆ నీరు స్వచ్ఛమైనవా, కలుషితమైనవా అని తనిఖీ చేసే అధికారులు లేరు. కాసులకు కక్కుర్తిపడి ప్లాంట్‌లను పరిశీలించడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో ప్రైవేటు వ్యాపారులు యథేచ్ఛగా నీటి దోపిడీకి పాల్పడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



తూములను పరిశీలిస్తున్న రైతులు

అనధికార తూముల పరిశీలన

చినగంజాం, జూలై 11 : కొమ్మమూరు కాలువ నుంచి వెళ్లే పంట కాలువలో అనధికారికంగా వేసిన తూములను టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, నాయకులు విక్రం నారాయణలతో కలిసి గొనసపూడి, కడవకుదురు రైతులు గురువారం పరిశీలించారు. కొమ్మమూరు కాలువ సంతరావూరు లాకుల వద్ద నుంచి కడవకుదురు వాద పొలాల వరకు ఉన్న పంటకాలువ (సైడ్‌చానల్) ద్వారా మూడు వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. నీటి పారుదల శాఖ వారు ఈ పంట కాలువలో కొన్ని తూములను ఏర్పాటు చేసి ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. పంట కాలువలో వేసిన తూముల ద్వారా వచ్చే సాగు నీటి ద్వారా రైతులు మూడు వేల ఎకరాలను సాగు చేస్తున్నారు.. పంట కాలువలో ఉన్న తూముల మధ్య కొంత మంది రైతులు అనధికారంగా కొన్ని తూములు ఏర్పాటు చేసుకొని సాగునీరు వినియోగించుకుంటున్నారు. దీని వలన దిగువ ఉన్న 1500 ఎకరాలకు సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఇరిగేషన్ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వీరయ్య తెలిపారు. అధికారులు శుక్రవారం వచ్చి పంట కాలువను పరిశీలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కడవకుదురు, గొనసపూడి రైతులు కేశన బాలయ్య, చల్లా వెంకటరావు, మదాసు ప్రసాద్, ఇందుర్తి వెంకటేశ్వర్లు, ఏకాంబరం పూర్ణచంద్రరావు, కేశన వెంకటరావు, కే.శేషు, తమ్మన శ్రీనివాసరావు, బత్తిన పున్నయ్య, ముద్దన జయచంద్రరావు, పరిటాల హనుమంతరావు, పట్టాభి వెంకటేశ్వర్లు, యడవల్లి పోతురాజు, రామిశెట్టి వెంకటేశ్వర్లు, కందిమళ్ళ ప్రసాద్, వంకాలపాటి అంజిబాబు పాల్గొన్నారు.

మొక్క విలువ తెలుసుకోవాలి



మొక్కలు చూపుతున్న విద్యార్థులు

అద్దంకిటౌన్, జూలై 11 : ప్రతి విద్యార్థి మొక్క విలువ తెలుసుకొని, వాటిని జాగ్రత్తగా పెంచి ఎంతో మందికి నీడనిచ్చేలా చేయాలని హెచ్‌ఎం సీహెచ్‌వీ శ్రీనివాసమూర్తి అన్నారు. గురువారం మండలంలోని బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు కోవి శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులందరికీ, ఉపాధ్యాయులకు రూ.10వేలతో 120 మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీనివాసరావుకు హెచ్‌ఎంతో పాటు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు మిత్రుడు నాగసూరి సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యజమాని అనుమతి లేకుండా కౌలు కార్డులివ్వాలి

కారంచేడు(పర్చూరు),జూలై 11: భూ అధీకరణ చట్టం ప్రకారం భూ యజమాని అనుమతి లేకుండా ప్రతి కౌలు రైతుకు కౌలు గుర్తింపు కార్డు ఇవ్వాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కారంచేడు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసంద్భంగా కౌలు రైతు సంఘ నాయకులు పి.ఏడుకొండలు మాట్లాడుతూ మండలంలో 80 శాతంకు పైగా భూమిని కౌలు రైతులే సాగు చేసుకుంటున్నారని ప్రభుత్వం ఇచ్చే రాయితీలు సాగుదారులకే చెందాలన్నారు. ఆరుగాలం సాగు చేసుకొని ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయి ప్రభుత్వ సాయం అందక కౌలు రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ, రెవెన్యూ అధ్వర్యంలో గ్రామ సభలు ఏర్పాటు చేసి సాగుచేసుకుంటున్న ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో నాగేశ్వరరావు, రాజు, చేతివృత్తి సంఘ నాయకులు పి.కొండయ్య పాల్గొన్నారు.

గుంటూరు : నాజ్ థియేటర్	పిడుగురాళ్ళ : గంగామహల్
గుంటూరు : హరిహరమహల్	పొన్నూరు : శ్రీలక్ష్మీ
గుంటూరు : గౌరీ శంకర్	మంగళగిరి : ఊర్వశి
గుంటూరు : శివ థియేటర్	మంగళగిరి : వెంకటేశ్వర
గుంటూరు : సినీ స్క్వేర్	రేపల్లె : రాజ్యలక్ష్మి
గుంటూరు : సినీ ప్రైమ్	మాచర్ల : వెంకటేశ్వర
గుంటూరు : వి.ప్లాటినో	సత్తెనపల్లి : సాయికృష్ణ
గుంటూరు : ఫోనిక్స్ మాల్ (మైత్రీ)	వినుకొండ : కీర్తి డీలక్స్
గుంటూరు : ది సినిమాస్	అద్దంకి : వి.ఎస్.ఎస్
గుంటూరు : జెఎల్‌ఇ సినిమాస్	టంగుటూరు : అప్సర
ఒంగోలు : గోరంట్ల సినిమాస్	చీమకుర్తి : కె3కె సినిమాస్
ఒంగోలు : రవి ప్రియమాల్	
ఒంగోలు : సత్యం థియేటర్	
తెనాలి : సంగమేశ్వర	
తెనాలి : పెమ్మసాని	
నరసరావుపేట : లక్ష్మీ నరసింహ	
నరసరావుపేట : ఈశ్వరమహల్	
చిలకలూరిపేట : సాయి కార్తీక	
చీరాల : సురేష్‌మహల్	
బాపట్ల : శ్రీనివాసమహల్	



ముక్తేశ్వరంలో చేతి పంపుల ఏర్పాటు

- పురాతన బావులను పరిశీలించిన అధికారుల బృందం
- పంచాయతీ నిధులతో గ్రామాల్లో పారిశుధ్య పనులు



ఎండిపోయిన బావులను పరిశీలిస్తున్న ఏఈ రామాంజనేయులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ, జూలై 11 : ప్రజలకు ఎలాంటి నీటి ఇబ్బందులు రాకుండా తక్షణమే పంచాయతీ నిధులతో చేతి పంపులను ఏర్పాటు చేయిస్తామని మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామాంజనేయులు తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో ముక్తేశ్వరంలో దాహం కేకలు అన్న కథనంపై అధికారులు స్పందించా రు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామాజంనేయులు, పంచాయతీ కార్యదర్శి బాజీ పంచాయతీ సర్పంచ్‌తో కలిసి గ్రామంలో నీరు లేక ఒట్టిపోయిన బావులను పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామస్తు లు కొందరు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, గృహాలలోకి మురుగు నీరు వస్తోందని, కాలువల్లో వ్యర్థాలను తీయడం లేదని, తాగునీరు లేదని పత్రికలో వార్తలు వస్తేగానీ మీకు తెలియలేదా అని కొందరు నిలదీశారు. ఈసందర్భంగా ఏఈ రామాంజనేయులు మాట్లాడుతూ వెంటనే ఎండిపోయిన బావుల దగ్గర చేతి పంపులను ఏర్పాటు చేయించాలన్నారు. అలానే పురాతన మహల్ బావి నీటిని వీధుల వెంట వచ్చేలా పైపు లైన్ మరమ్మతులు చేయిస్తామన్నారు. పంచాయతీ నిధులతో గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించాలని సర్పంచ్‌కు సూచించారు. నీటి ఎద్దడి వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూశామని బావులలో కూడా పూడిక పనులు చేయిస్తామని తెలిపారు.



స్టూడెంట్ కిట్లను అందజేస్తున్న సీఎంవో

పిల్లలను బడిలో చేర్పించాలి

పర్చూరు, జూలై 11 : బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ (సీఎంవో) శ్రీనివాసరెడ్డి అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గురువారం పర్చూరులోని ఇందిరా కాలనీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎంవో, ఎఎల్ఎస్ కోర్డినేటర్ సత్యసాగర్ పాల్గొన్నారు. బడిబయట ఉన్న పిల్లలను 11 మందిని గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. అనంతరం వారికి స్టూడెంట్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో పి.వెంకట్రామయ్య, హెచ్‌ఎం నాగమణి, ఎన్యుమరేటర్లు ఉమా మహేశ్వరరావు, సాయికుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులు బడిలో చేరిక

యద్దనపూడి, (మార్టూరు) : నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గురువారం యద్దనపూడి జడ్పీ హైస్కూల్‌లో ఇద్దరు విద్యార్థులు 8వ తరగతిలోకి ఎంఈవో చిలుకూరి గోపి ఆధ్వర్యంలో చేరారు. అనంతరం వారికి వెంటనే ప్రధానోపాధ్యాయులు దేవేంద్రరావు స్టూడెంట్ కిట్‌లను ఎంఈవో చేతులమీదగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు యూసఫ్, ప్రేమ్ కుమార్, మస్తానవలి పాల్గొన్నారు.

గంగవరంలో లక్ష్మీగణపతి హోమం

గంగవరం(ఇంకొల్లు), జూలై 11 : మండలంలోని గంగవరం గ్రామంలో లక్ష్మీగణపతి హోమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. శివాలయ పునఃనిర్మాణంలో భాగంగా శివునికి అత్యంత ఇష్టమైన లక్ష్మీగణపతి హోమాన్ని కోటప్పకొండ త్రికోటేశ్వరాలయ అర్చకులు నాగబోగేంద్రశర్మ, రాజీవ్ శాస్త్రితో శివాలయ ఆవరణలో 21 మంది దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ హోమంలో గ్రామపెద్దలు, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హోమం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



అధ్యాపకుడిని అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

సెయింట్ ఆన్స్ అధ్యాపకుడికి అవార్డ్

చీరాల, జూలై 11 : సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో అధ్యాపకునిగా పనిచేస్తున్న గర్నిపూడి దిలీప్ కుమార్ జాతీయ స్థాయి అవార్డు పొందారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటు కార్యక్రమంలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వీ రమణారావు, కళాశాల ప్రిన్సిపల్ వీవీ నాగేశ్వరరావు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ షోలాపూర్‌కు చెందిన ఆవిష్కార్ ఫౌండేషన్ వారు ప్రకటించిన ఎచీవర్స్ అవార్డు - 2024కు నేషనల్ లెవల్ బెస్ట్ యంగ్ టీచర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును దిలీప్‌కుమార్ పొందారన్నారు. ఫార్మసీ ఎడ్యుకేషన్, సైంటిఫిక్ రీసెర్చ్‌కు గాను ఆ అవార్డు అందుకున్నారని వివరించారు. కార్యక్రమంలో పలు విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మురుగు నిల్వ ఉండకుండా చర్యలు

అద్దంకి, జూలై 11 : మురుగు నిల్వ ఉండకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. అద్దంకి పట్టణంలోని 7 వ వార్డు పరిధిలోని గుర్రాల కాలనీ, మొండితోక పాలెం తదితర ప్రాంతాలలో గురువారం సిబ్బందితో కలిసి కమిషనర్ సత్యనారాయణ పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



7వ వార్డులో పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

జనాభా పెరుగుదలపై అవగాహన అవసరం

అద్దంకిటౌన్, జూలై 11 : జనాభా పెరుగుదల వలన ఉత్పన్నమయ్యే సమస్యలపై అవగాహన అవసమని ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మోహనరావు అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కేఆర్‌కే డిగ్రీ కళాశాల వద్ద రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు హనుమంతరాజు, అశోక్‌కుమార్, రామకృష్ణ తదితరులు వ్యాధి లక్షణాలు, వాటి నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డీ గంగయ్య, గుంజి శివకోటి, రాజశేఖర్ తదితరులు జనాభా పెరుగుదల, వాటి వలన పకృతి వనరులపై ప్రభావం, జాతుల వలసలు, అతిక్రమణలు వంటి వాటి గురించి వివరించారు. ప్రధాన రహదారి వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు.

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అద్దంకి ప్రభుత్వ వైద్యశాల నుంచి మోదేపల్లి పీహెచ్‌సీ, పట్టణంలోని గాజులపాలెం, కాకాని పాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్యధికారులు, ఆరోగ్య కార్యకర్తలతో అద్దంకి పట్టణంలోని ప్రధాన వీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ఆరోగ్య కార్యకర్తలు మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యధికారులు ఎన్.శ్రీహర్ష, జి. జయసింహ, హేమమాధురి, మనోజ్, హరికృష్ణ, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



అద్దంకిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

చినగంజాం : ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటిస్తే అధిక జనాభాను అరికట్టవచ్చునని చినగంజాం, సంతరావూరు వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, బి.నాగేంద్ర అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా సంతరావూరు, చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని సిబ్బంది, విద్యార్థులు గురువారం గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. బాల్య వివాహాలు చేయరాదని, వివాహానికి మగవారికి 24 సంవత్సరాలు, ఆడవారికి వయస్సు 21 సంవత్సరాలు ఉండాలని వైద్యాధికారులు సూచించారు. కార్యక్రమంలో చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి పీ.సాయిశ్రీచరణ్, సీహెచ్.ఎస్. బేబీ, హెల్త్ సూపర్‌వైజర్ చిరంజీవి, ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, హెచ్‌ఈ మాధవి, హెల్త్ అసిస్టెంట్‌లు ఎస్.మురళి, మహేష్, జీ.వి జయప్రసన్న, పీవీ.సుబ్బారావు, రాజకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ శ్యామ్‌సుందర్‌బాబు, ఎంఎన్‌వో సుబ్బారావు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

యద్దనపూడి, (మార్టూరు) : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం యద్దనపూడి ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టరు పీ శ్రీహర్ష ర్యాలీని ప్రారంభించి, ప్రతి ఒక్కరూ కుటుంబనియంత్రణ పాటించాలన్నారు. ర్యాలీలో సీహెచ్‌వో టీవీఎస్ ప్రసాద్, సూపర్ వైజర్లు నాగేశ్వరరావు, సునంద, రారాజు, చంద్రశేఖర్, విమల, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొండయ్యకు ఘన స్వాగతం



వైజాగ్‌లో ఊరేగింపుగా వెళ్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 11 : చీరాల నియోజకవర్గం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు గురువారం వైజాగ్‌లో ఘనస్వాగతం లభించింది. ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత తొలిసారిగా వైజాగ్‌కు వెళ్లిన కొండయ్యకు ఎయిర్‌పోర్టు నుంచి అనుచరులు, శ్రేయోభిలాషులు, తమ వ్యాపార సంస్థల ప్రతినిధులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఆర్‌కే టౌన్‌షిప్ అధినేతగా కొండయ్య ఆ ప్రాంత వాసులకు సుపరిచితులు. కార్యక్రమంలో కొండయ్య పెద్దకుమారుడు గౌరీఅమర్‌నాథ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ ఎంపీహెచ్‌ఈవోగా నాగేశ్వరరావు



వైద్యాధికారుల నుంచి అవార్డు అందుకుంటున్న నాగేశ్వరరావు

అద్దంకిటౌన్, జూలై 11 : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ అధికారులను ఎంపిక చేసి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా అద్దంకిలోని మోదేపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఆరోగ్య విస్తరణాధికారి (ఎంపీహెచ్‌ఈవో)గా పని చేస్తున్న అద్దంకి నాగేశ్వరరావుకు ఉత్తమ ఆరోగ్య విస్తరణాధికారిగా అవార్డును జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ అందజేశారు. ఎంపీహెచ్‌వో నాగేశ్వరరావును వైద్యధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులు

వేటపాలెం(చీరాల), జూలై 11 : పందిళ్లపల్లి హై స్కూల్లో 2023-24 విద్యా సంవత్సరంలో పదవతరగతి చదివిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన నట్లు స్కూల్ హెచ్‌ఎం ఎం.శేఖరరావు గురువారం తెలిపారు. ములకల శ్యామల, కోనంకి భార్గవ్‌లు నూజివీడు ట్రిపుల్ ఐటీలోను, వంగర రోహిణి, ఆళోది హర్ష, సజ్జ శివసాయిశ్రావణ్ ఒంగోలు ట్రిపుల్ ఐటీలోను సీట్లు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు, సహ విద్యార్థులు అభినందించారు.

మార్టూరు : మండలంలోని వలపర్ల, మార్టూరు జడ్పీ హైస్కూల్స్‌లో 10వతరగతి చదివిన 10 మంది విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు లభించాయి. వలపర్ల జడ్పీ హైస్కూల్‌లో 8 మంది విద్యార్థులకు సీట్లు లభించినట్లు గురువారం హెచ్‌ఎం ఎం.నిర్మల తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో లభించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. మార్టూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు లభించినట్లు హెచ్‌ఎం బీ రూత్‌మెర్సీజాయ్ తెలిపారు. వారిద్దరినీ ఉపాధ్యాయులు అభినందించారు.

మేదరమెట : కొరిశపాడు మండలంలోని రావినూతల, మేదరమెట్ల హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. గురువారం వెలువడిన ఫలితాలల్లో ముగ్గురు విద్యార్థులు ఒంగోలు, ట్రిపుల్ ఐటీ నూజివీడులో సీట్లు సాధించారు. రావినూతల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పొదిలి లలిత శ్రీ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కుంచాల మనీష ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, ఉన్నం ఉమామహేశ్వరి నూజివీడులో సీట్లు సాధించినట్లు ఎంఈవో పున్నయ్య తెలిపారు. ఏటా కొరిశపాడు మండలం నుంచి ట్రిపుల్ ఐటీకి ఎంపిక అవుతున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈవో పున్నయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.


నేడు ప్రతిభ విద్యార్థులకు ఉపకారవేతనాలు

పంగులూరు, జూలై 11 : విద్యోన్నతి ఫౌండేషన్ నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు శుక్రవారం ఉపకార వేతనాలను అందజేయనున్నట్లు ఫౌండేషన్ డైరెక్టర్ ధూళిపాళ్ల వీరనారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు, బోడెంపూడి రామమూర్తి స్మారకార్థం ఏర్పాటు చేసిన ఈ ఫౌండేషన్ ద్వారా ఈ ఏడాది ఫిబ్రవరి 11న పంగులూరు, అద్దంకి, ఇంకొల్లు మండలాల పరిధిలో 10వ తరగతి విద్యార్థులకు మూడు కేంద్రాలలో టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించామన్నారు. ఈ కేంద్రాలలో పోటీ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులలో మూడు మండలాలలో మొదటి ఐదు స్థానాలు పొందిన 15 మందితో పాటు గత ఏడాది ఎంపికైన 15 మందికి 2024-26లో ఇంటర్ చదువుకు వీలుగా 30 మందికి మూడు లక్షలు ఉపకారవేతనంగా అందచేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ ధూళిపాళ్ల షర్మిల ప్రియాంక సౌజన్యంతో అద్దంకిలోని కాకానిపాలెం జడ్పీ పాఠశాలలో శుక్రవారం ఉపకార వేతనాలను అందజేస్తున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

చీరాల, జూలై 11 : వాసవీ క్లబ్, వాసవీ వనిత ఆధ్వర్యంలో గురువారం క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్ర దంపతులు పెళ్లిరోజు సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వల్లంపట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రార్థించే పెదవులకన్నా.. సేవచేసే చేతులు మిన్న



శుభాకాంక్షలు తెలుపుతున్న చిన్నారులు

చీరాల, జూలై 11 : ప్రార్థించే పెదవులకన్నా. సేవచేసే చేతులు మిన్న అని హైదరాబాద్ పీపుల్ విత్ హియరింగ్ ఇంపైర్ నెట్‌వర్క్(పీహెచ్‌ఐఎన్) స్కూలు ప్రతినిధులు పేర్కొన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మనుమడు, మహేంద్రనాథ్ కుమారుడు రీహాన్ పుట్టిన రోజు సందర్భంగా సదురు స్కూల్లో గురువారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా స్కూలు నిర్వాహకులు, విద్యార్థులకు రీహాన్‌కు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

పమిడిపాడు రేషన్‌షాప్‌లో తనిఖీ

మేదరమెట్ల , జూలై 11 : మండలంలోని పమిడిపాడులో 21వ నెంబరు రేషన్ దుకాణంపై విజిలెన్స్ డీటీ సుధారాణి షాపును తనిఖీ చేశారు. ఉండాల్సిన నిల్వ కన్న 21 కింటాళ్ల బియ్యం అదనంగా ఉండడంతో 6ఏ కేసు నమోదు చేశారు. అదనంగా ఉన్న బియ్యాన్ని వీఆర్‌వో మస్తాన్‌రావుకు అప్పగించారు.



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ డీటీ సుధారాణి